

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 25.0



ఉచిత బస్సుకు..
విధి విధానాలు ఖరారు

- 15 నుంచి ఐదు రకాల బస్సులు ఫ్రీ
- జిల్లాలో మహిళా ప్రయాణికులు 48 వేలు.. అతికొద్ది ఎక్స్‌ప్రెస్ సర్వీసులే ఆధారం
- ఆధార్, ప్రభుత్వ గుర్తింపు పత్రాలతో ప్రయాణానికి ఛాన్స్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఆర్టీసీ బస్సుల్లో మహిళల ప్రయాణాలకు విధి విధానాలు ఖరారయ్యాయి.స్త్రీ శక్తి పథకం కింద అధికారికంగా పేరును ఖరారు చేశారు. ఈనెల 15 నుంచి జిల్లాలో 190 బస్సు సర్వీసులు పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ప్రయాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారమన్న గుర్తింపు కార్డులు ఆధార్, ఓటరు కార్డు, ప్రభుత్వం జారీ చేసిన కార్డులతో ప్రయాణాలను చేయవచ్చు. నాన్ స్టాప్ సర్వీసు, అంతరాష్ట్ర సర్వీసులు, కాంట్రాక్ట్ క్యారేజ్ సర్వీసు, ప్యాకేజీ టూర్ బస్సుల్లో ఉచిత ప్రయాణాలు వర్తించవు. సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైన్ ఏసీ బస్సుల్లో ప్రయాణాలకు అనుమతించరు. జిల్లాలో రోజూవారీ 80 వేల మంది ప్రయాణికులు వివిధ రూట్లలో రాక పోకలు సాగిస్తుండగా అందులో 40 శాతం మహిళలు అంటే 32 వేలు ఉంటారని, ఉచితంగా మరో 10 శాతం అదనంగా తిరుగుతారని అంచనాతో మొత్తం 48 వేలు ఉచితంగా ప్రయాణాలు చేయడానికి అవకాశం ఉందని అంచనా వేశారు.

రాష్ట్రం దాటే సర్వీసులు.. స్టేజీల లెక్కన ఫేర్

జిల్లాలో మొత్తం ఉచితానికి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కేవలం 15 బస్సులే ఉన్నాయి. దీంతో సుదూర ప్రయాణాలకు ఏలూరు నుంచి నేరుగా వెళ్లడానికి అవకాశం లేదు. ఏలూరు నుంచి రాజమండ్రి వరకు మాత్రమే ఎక్కువగా డైరెక్ట్‌గా వెళ్లగలరు. ఇతర జిల్లాలకు వెళ్లిన అక్కడ నుంచి వేరే బస్సు సర్వీసుల ద్వారానే వెళ్లాల్సి ఉంటుంది. ఏలూరు జిల్లా నుంచి భద్రాచలం, సత్తుపల్లి బస్సు సర్వీసులను ఏలూరు నుంచి నడుపుతున్నప్పటికి రాష్ట్ర సరిహద్దు దాటితే అక్కడ నుంచి ఎన్ని స్టేజ్‌లుంటే అంతటికి టిక్కెట్ జారీ చేస్తారు. ఇప్పటి వరకు ఆక్యుపెన్సీ రేషియో 74 శాతం ఏలూరు జిల్లాకు ఉండగా, మహిళల ప్రయాణాలతో అది 100 శాతంకు చేరుకుంటుందని ఏలూరు డీపీటీవో షేక్ షబ్నం తెలిపారు. అంతరాష్ట్ర సర్వీసులకు జీరో టిక్కెట్ జారీ విధానంపై సందేహం వ్యక్తమైందని, దీనిపై ఉన్నతాధికారుల నుంచి క్లారిటీ తీసుకుంటున్నామన్నారు.

గ్రంథాలయాలు..విజ్ఞాన భాండాగారాలు

నేడు జాతీయ గ్రంథాలయ దినోత్సవం

■ లోపలి పేజీలో..

సొమ్ము మాది.. సోకు మీదా!



ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే అనేక విభాగాల్లో కష్టాలు ఎదురవు తున్నాయి. రావాల్సిన సొమ్ము రాక, చేసిన అప్పులు తీరక నానా తిప్పలు. ప్రతీసారి కొత్త ఆర్థిక సంవత్సరంలో అడుగిడుతున్నామంటే కొంతలో కొంత మార్పులు, చేర్పులు ఉండేవి. కాని ఈసారి దీనికి భిన్నంగా తొలి త్రైమాసికం ముగిసినా.. రావాల్సిన నిధులు రానేలేదు. వేలాది మంది భత్యం మీద ఆధారపడి ఉండగా, వీరికి ఇవ్వాల్సిన ఉపాధి వాటా కింద రూ.140 కోట్లు రానేరాలేదు. ఇవాళ, రేపు అంటూ నాన్చివేత. ఇంకోవైపు పల్లెలకు చెందాల్సిన సీనరేజ్, గ్రంథాలయ సెస్సు, ఆఖరికి రిజిస్ట్రేషన్ సెస్ మొఖం చాటేశాయి. ఈ ఏప్రిల్ నుంచి విడతల వారీగా రావాల్సిన నిధుల్లేవి రానేరాలేదు.

- ఉపాధిలో కూలీలకు సొమ్ము లేదు
- పంచాయతీల్లో సెస్ సంగతేమిటి..?
- నిధుల మాటెత్తితే.. అంతా సైలెంట్
- తొలి త్రైమాసికం ముగిసినా రాలిపడని నిధులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ప్రభుత్వ విభాగాల్లో సొమ్ముకి కటకట. ఇంతకుముందు ఆర్థిక సంవత్సరం ముగిసిన వెంటనే సరికొత్త ప్రతిపాదనలు, ఆ మేరకు తగిన నిధులను కేటాయించేవారు. అక్షరాలా ఇస్తామన్న సొమ్మంతా వచ్చేసేది. ఏనాడు రేపు, మాపంటూ తిప్పించుకోలేదు. కానీ రానురాను అన్ని శాఖల్లోనూ ఆనాయితీ తప్పింది. ఆ స్థానంలో విజ్ఞాపనలు పెరిగాయి. ప్రత్యేకించి ఉపాధి హామీ కింద ప్రతీరోజు వేల మంది తమకు నిర్దేశించిన పనుల్లో నిమగ్నమవుతూ వచ్చారు. గతంలో వీరికి రావాల్సిన భత్యంను బకాయి పడకుండా చెల్లించేసేవారు. ఆ మేరకు కేంద్రం స్పందించేది. ఏటా నిర్దేశించిన లక్ష్యాల్లో భాగంగా పని రోజులకు సరిపడా నిధులను అందుబాటులో ఉంచేవారు. ఏమైందో ఏమో గానీ, ఈ ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచే ఉపాధి కూలీలకు కష్టాలు ఆరంభమయ్యాయి. రోజూవారీ కూలీ మీదే ఆధారపడే అనేక కుటుంబాలు ఇప్పుడు సొమ్ములు చేతికందక తిప్పలు పడుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి బకాయిలు సుమారు రూ.140 కోట్ల మేర కూలీలకు అందాల్సి ఉంది. ఒకవేళ కేం ద్రం విడుదల చేసి ఉంటే ఆ మేరకు కూలీల చేతికి అందాల్సి ఉంది. జిల్లావ్యాప్తంగా నాలుగు న్నర లక్షల మంది జాబ్ కార్డుదారులకు సరా సరిన నెలకు 50 లక్షలు పనిదినాలను నమోదు చేయాల్సి ఉంది. ఈ లెక్కన ఇప్పటి వరకు రూ.120 కోట్ల నుంచి రూ.130 కోట్లు ఉపాధి కూలీలకు చెల్లించాల్సి ఉంది. ఉపాధి కూలీల ఖాతాల్లో జమ చేసేందుకు జాప్యం జరుగు తుండడం కూలీల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది.

సెస్ ఎక్కడికి పోయింది ?

ఇప్పటికే 14,15 ఆర్థిక సంఘాల ద్వారా సక్రమంగా నిధులు విడుదల కాక పంచాయతీలన్నీ తిప్పలు పడ్డాయి. ఆఖరికి స్థానిక సంస్థలకు సెస్ రూపేణ అందాల్సిన ఆదాయం అందకుండా పోతోంది. చాలాకాలంగా గ్రంథాలయ సెస్ పంచాతీయలకు రాకుండానే పోయింది. ఇదేమని ప్రశ్నించేవారు కరువయ్యారు. ఇంకొందరు మాత్రం పంచాయతీల పరిస్థితి బాగాలేదని, ఆదుకునే దిశగా చర్యలు తీసుకోవాలని, గత జగన్ ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేసి ఫలితం లేక మిన్నకుండిపోయారు. ఇప్పుడు తాజాగా గ్రంథాలయ సెస్ రాకుండానే మిగిలిపోయింది. సీనరేజ్ సెస్ విషయంలోను ఇదే పరిస్థితి. తాజాగా ఈ ఆర్థిక సంవత్సరం నుంచి పంచాయతీలకు అందాల్సిన తొలి త్రైమాసిక రిజిస్ట్రేషన్ సెస్ పెండింగ్‌లో ఉంది. ప్రతీ పంచాయతీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పరిధిలో జరిగే రిజిస్ట్రేషన్‌ల్లో రెండుశాతం సెస్‌గా చెల్లించాలి. మేజర్ పంచాయతీల్లో ఈ తరహా సెస్ రూపంలో రూ.లక్షల్లోనే ఏటా ఆదాయం ఉంటుంది. కాని ఈసారి ఎందుకో రిజిస్ట్రేషన్ సెస్ ఇప్పటివరకు పంచాయతీలకు అందలేదు. ఒకవైపు 15వ ఆర్థిక సంఘం నిధులు అందకుండా పోయిన తరుణంలోనే కాస్తో,కూస్తో ఆదాయంలో భాగమైన రిజిస్ట్రేషన్ సెస్ ఆ కోవలోకే చేరాయి. వాస్తవానికి సెస్ ప్రస్తావన వచ్చేసరికి 2014 ముందు వరకు పంచాయతీలకు బాగానే ఉండేది. అప్పట్లో జిల్లా పరిషత్ వేదికగా సెస్‌ల ప్రస్తావన జరిగేది. స్థానిక సంస్థల ప్రతినిధులు నేరుగా నిలదీసేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి మచ్చుకైనా కనిపించడం లేదు. అయినా తమకు రావాల్సిన వాటాను కోల్పోవడానికి పంచాయతీలు సిద్ధంగా లేవు. వీలు కుదిరినప్పుడల్లా స్థానిక సంస్థల ప్రతినిధులు వీధుల కెక్కుతూనే ఉన్నారు. పాలనా యంత్రాంగం సాక్షిగా రావాల్సిన సొమ్ము మాదే అయినప్పటికి ఒక పక్క రాజకీయ ప్రతినిధులు, మరో పక్క అధికారులు సోకులకు పోతున్నారనే ఆగ్రహం అందరిలోనూ ఉంది.

నూజివీడు సబ్ కలెక్టర్‌గా వినూత్న



నూజివీడు/ఏలూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నూజివీడు సబ్ కలెక్టర్‌గా బొల్లిపల్లి వినూత్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2023 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె అనంతపురంలో ట్రైనీగా పనిచేయగా పూర్తి బాధ్యతలపై నూజివీడు సబ్‌కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న బి.స్మరణ్‌రాజ్ బదిలీపై వెళ్లారు. ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వానికి సిఫార్సులు చేస్తానన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కాగా కలెక్టర్ వెట్రిసెల్విని, జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వర రావులను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

కాగుపాడు సర్పంచ్ అధికారాల పునరుద్ధరణ

ఉంగుటూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగుపాడు సర్పంచి కడియాల సుదేష్ణ అధి కారాలను పునరుద్ధరించినట్టు అధికారులు వెల్లడిం చారు. అధికార దుర్వినియోగం ఆరోపణలపై గత ఏప్రిల్ 6న డీపీవో సర్పంచి కడియాల సుదేష్ణను పదవి నుంచి మూడు నెలల పాటు సస్పెండ్ చేశారు. అధికారులు పునర్విచారణ అనంతరం సోమవారం సర్పంచ్ అధికారాలను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గనులశాఖ డీడీగా పాపారావు

ఏలూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా భూగర్భ, గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పాపారావు నియమితులయ్యారు. ఈయన ఏపీఎండీసీ కార్యాలయం నుంచి ఇక్కడకు రానున్నారు. అంతకుముందు డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసిన రవికుమార్ జూన్ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయడంతో, విజిలెన్స్ విభాగంలో పని చేస్తున్న కిశోర్ బాపూజీకి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.

నేడు నులిపురుగుల నిర్మూలనకు మాత్రల పంపిణీ

ఏలూరు అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):జాతీయ నులిపురుగుల నిర్మూలన దినాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా వ్యాప్తంగా 3,76,263 మంది అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు, స్కూలు, కళాశాలల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను నిర్దేశిత డోసులో పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే.అమృతం తెలిపారు. పిల్లల కడుపులోని కొంకి పురుగు, నులి పురుగు, బద్దె పురుగు, గుండ్రని పురుగులను నివారించడం ద్వారా పిల్లల ఆరోగ్యాభివృద్ధిని పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశమన్నారు. మాత్రను చప్పరిస్తూ, మింగాల్సి ఉంటుందన్నారు. ముందుగా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, సిబ్బంది, ఆయాలు, వంట సిబ్బందికి మధ్యాహ్న భోజనం తర్వాత మాత్రలను మింగించిన తర్వాతే వైద్యఆరోగ్యశాఖ హెల్త్ సూపర్‌వైజర్ల (మేల్, ఫిమేల్) ద్వారా పిల్లలతో మాత్రలను మింగిస్తారని తెలిపారు. మంగళవారం మాత్రను తీసుకోనివారికోసం ఈనెల 20న నిర్వహించే మాప్ అప్ డే సందర్భంగా మింగించడం జరుగుతుందన్నారు.



వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

అర్జీల పరిష్కారంలో అలసత్వం సహించం

- కలెక్టర్ వెట్రిసెల్వి.. పీజీఆర్ఎస్‌లో అర్జీల స్వీకరణ

ఏలూరు రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుతఅంబరీష్, ఎస్డీసీ భాస్కర్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, సర్వే ఏడీ అన్సారీ, కమిషనర్ భాను ప్రతాప్ 268 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లా డుతూ అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఫిర్యాదుల నమోదు : ఎస్పీ



ఏలూరు క్రైం : ప్రతి ఫిర్యాదు పారదర్శకంగా పేపర్ రహితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోట్ ద్వారా ఫిర్యాదును నమోదు చేస్తున్నట్టు ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఆయన ఏఎస్పీ సూర్యచంద్రరావుతో కలసి మొత్తం 53 ఫిర్యాదులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల స్థితిని తెలుసుకోవాలంటే 1100 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

18న తాటాకులతో హస్తకళా నైపుణ్య శిక్షణ

ఏలూరు,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల జీవనోపాధి మెరుగుపర్చేందుకు ఈనెల 18 నుంచి తాటాకులతో హస్తకళా నైపుణ్య శిక్షణ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో మహిళలు తాటాకుతో తయారు చేసిన పలు హస్తకళ ఉత్పత్తులను కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి పరిశీలించారు.కలెక్టర్ మాట్లాడుతూ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో చింతలపూడి, లింగపాలెం మండలాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు తాటాకులతో అల్లికల ద్వారా పూలబుట్టలు, టోపీలు, దండలు, పూల బొకేలు, ఇతర బొమ్మలు తయారు చేసే హస్తకళాకారులకు చింతలపూడిలో శిక్షణ ఇస్తారన్నారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు పాల్గొన్నారు.

నెలాఖరుకు హాస్టళ్లు, పాఠశాలల్లో పనులు పూర్తి

జిల్లాలో సంక్షేమ హాస్టల్స్, పాఠశాలలు, అంగన్‌వాడీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టిన పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆమె వివిధ పనులు పురోగతిపై సమీక్షిస్తూ జిల్లాలో రూ.5.72 కోట్లతో చేపట్టిన హాస్టల్స్ పనులు నాణ్యతతో పూర్తి చేయాలని, 229 పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీపీవో వాసుదేవరావు, సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ పంకజ్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ జేడీ విశ్వమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ఫలితాలు విడుదల

ఏలూరు అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీల్లో ఒకటైన మెగా డీఎస్సీ ఉపాధ్యాయ రిక్రూట్‌మెంట్ పరీక్ష ఫలితాలు సోమవారం రాత్రి విడుదలయ్యాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 1,035 పోస్టులకు భర్తీకి చేపట్టిన నియామకాలకు జూన్ 6 నుంచి జూలై 2వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో ఎనిమిది కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 34,218 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఏలూరు జిల్లాకు సంబంధించి మొత్తం మూడు కేంద్రాల్లో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలకు 17,386 మంది అభ్యర్థులను కేటాయించగా, వారిలో 16,154 మంది హాజరయ్యారు. ఫలితాలను అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్లకు పంపించారు. రాతపరీక్ష (టీఆర్టీ/ఆన్‌లైన్ పరీక్ష)కు 80శాతం మార్కులు, టెట్ స్కోరుకు 20శాతం మార్కులు వెయిటేజీ అర్హతకు ప్రామాణికంగా ఇచ్చారు.

ఉమ్మడి జిల్లాలో 1035 పోస్టుల భర్తీ ఇలా

ఉమ్మడి జిల్లాలో భర్తీ చేయతలపెట్టిన మొత్తం 1035 పాఠశాలవిద్యాశాఖ పోస్టులతోపాటు, మరికొన్ని ఏలూరు రూరల్‌మండలం శనివారపు పేటలోని ప్రభుత్వ బాలుర వసతిగృహం, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల పాఠశాలల్లో టీజీటీలు, పీజీటీలు, ప్రిన్సిపాల్ నియామకాలుకూడా ఉన్నాయి. పాఠశాల విద్యాశాఖకు సంబంధించి గవర్నమెంట్/జడ్పీ యాజమాన్యాల్లో 837, ఉమ్మడిజిల్లాలోని అన్ని పురపాలక సంఘాల యాజమాన్యాల్లో 153, ఏలూరు నగరపాలక సంస్థ యాజమాన్యంలో 45 పోస్టులను నోటిఫై చేశారు. వీటిని సబ్జెక్టులవారీగా విభజిస్తే అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో తెలుగు 40 పోస్టులు, హిందీ 61, ఇంగ్లీషు 84, గణితం 40, ఫిజికల్ సైన్సు 40, బయోలాజికల్ సైన్సు 64, సోషల్ స్టడీస్ 103, ఫిజికల్ డైరెక్టర్ 181, సంస్కృతం రెండు ఉన్నాయి. సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) కేడర్‌లో తెలుగు 417 పోస్టులు, ఉర్దూ మూడు భర్తీ అవుతాయి. రోస్టర్ కం రిజర్వేషన్ ప్రాతిపదికన ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఉమ్మడి జిల్లాలో ఆయా సబ్జెక్టుల్లో అర్హతలు సాధించిన అభ్యర్థుల నుంచి ఎంపికలు జరుగుతాయి. సోమవారం పరీక్షల ఫలితాలు విడుదలైన నేపథ్యంలో తదుపరి నియామక ప్రక్రియపై ప్రభుత్వం తేదీలను ప్రకటించాల్సి ఉంది.

తారుకు నోచుకోని బీటీ రోడ్లు!



గోతులు పడి కుంగిన సంతోషపురం-భోగేశ్వరస్వామి బీటీ రోడ్డు

- బిల్లులు చెల్లించని గత వైసీపీ ప్రభుత్వం
- తారు వేయకుండా వదిలేసిన కాంట్రాక్టర్

కలిదిండి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన బీటీ రోడ్లు తారుకు నోచుకోకపోవడంతో పెద్ద గోతులు పడి అధ్వానంగా మారాయి. సుమారు రూ.ఏడు కోట్లతో నిర్మించిన పాతాళ భోగేశ్వరస్వామి - సంతోషపురం బీటీ రోడ్డు గోతులు పడి కాల్వలోకి కుంగి పగుళ్ల ఏర్పడడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సుమారు రూ.ఐదు కోట్లతో నిర్మించిన శాంతినగరం - పెదలంక బీటీ రోడ్డు పలు చోట్ల రోడ్డు పగుళ్ల ఏర్పడి కాల్వలో కుంగిపోయింది. ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. నిత్యం ఈ రహదారులపై పెదలంక, శాంతినగరం, మూల్లంక, పొలు పేట, భాస్కరావుపేట, సంతోషపురం, కొత్తూరు భోగేశ్వరం లంక గ్రామాల ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతీ సోమవారం దక్షిణ కాశీగా పేరొందిన పాతాళ భోగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. వైసీపీ హయాంలో బీటీ గ్రావెల్ రోడ్లపై తారు వేయకుండా వదిలేయడంతో పగుళ్లతో గోతులు పడి కుంగిపోతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో తారు వేయకుండా కాంట్రాక్టర్ నిలుపుదల చేశారు. దీంతో బీటీ గ్రావెల్ రోడ్లు నిర్మాణ దశలోనే పెద్ద గోతులు పడి పాడైపోతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బీటీ గ్రావెల్ రోడ్లపై తారు వేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ ఏఈఈ పృథ్వీరాజ్‌ను వివరణ కోరగా గతంలో నిర్మించిన బీటీ గ్రావెల్ రోడ్లకు బిల్లులు చెల్లించకపోవడంతో తారు నిర్మాణం నిలిచిందని, నెల రోజుల్లో కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించి బీటీ రోడ్డుపై తారు వేయడానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అదనపు లోడ్.. భారం తగ్గేలా!

- వి.డి.ఎస్ దరఖాస్తుల స్వీకరణలో జిల్లా మొదటి స్థానం
- దరఖాస్తులు 13,579..వసూలైంది రూ.248.95 లక్షలు
- రిజిస్టరు కాకుండా అదనపులోడ్ వినియోగం వల్ల సమస్యలు



ఏలూరుసిటీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులకు తాము వినియోగించే విద్యుత్ వాడకాన్ని అనుసరించి అదనపు లోడ్ తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీ కల్పించింది. అదనపులోడ్ ఏర్పాటు చేసుకోవడానికి 50 శాతం సబ్సిడీ కల్పించి విద్యుత్ వినియోగదారుల నుంచి చార్జీలు వసూలు చేస్తున్నారు. అదనపు లోడ్ విద్యుత్ రాయితీకి సంబంధించి దరఖాస్తుల స్వీకరణలో ఏలూరు జిల్లా ఏపీఈపీడీసీఎల్ పరిధిలో మొదటి స్థానంలో నిలిచింది.

గృహ విద్యుత్ వినియోగంలో విద్యుత్ వాడకానికి సంబంధించి అదనపు విద్యుత్ వాడుతున్న వినియోగదారులకు స్వచ్ఛంద అదనపు లోడ్ వెల్లడి పథకం (వి.డి.ఎస్-వలంటరీ డిస్‌క్లోజర్ స్కీమ్) ప్రత్యేక డ్రైవ్‌లో అదనపు లోడ్‌కు డెవలప్‌మెంట్ చార్జీలలో 50 శాతం రాయితీ కల్పించి ఈ ఏడాది జూన్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు జిల్లా విద్యుత్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ గడువును డిసెంబరు నెలాఖరు వరకు పొడిగించింది. దీని ప్రకారం ఒక కిలోవాట్‌కు దరఖాస్తు ఫీజు రూ.50, సెక్యూరిటీ డిపా జిట్ రూ.200, డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2వేలు చెల్లించాల్సి ఉంది. ఏపీఈపీడీసీఎల్ ప్రకటించిన విడిఎస్ పథకంలో కిలోవాట్‌కు రూ.1,250, రెండు కిలోవాట్లకు రూ.2,450, మూడు కిలోవాట్లకు రూ.3,650 మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఈ మేరకు ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణలో జిల్లా ఫస్ట్


గృహ విద్యుత్ వినియోగంలో అదనపులోడ్ విద్యుత్ రాయితీకి సంబంధించి విడిఎస్ పథకంలో దరఖాస్తుల స్వీకరణంలో ఏపీఈపీడీసీఎల్ పరిధిలో ఏలూరు జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఈ జిల్లాలో ఇప్పటివరకు 13,579 మంది వినియోగదారుల నుంచి అదనపులోడ్ విద్యుత్ రాయితీకి సంబంధించి రూ.2.48 కోట్లు వసూలు చేశారు. తూర్పుగోదావరి జిల్లా 10,097 దరఖాస్తులతో రెండో స్థానంలో, 9,249 దరఖాస్తులతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తృతీయ స్థానంలో నిలిచింది. ఏలూరు జిల్లాలో మొత్తం 4లక్షల 61వేల వరకు గృహ విద్యుత్ వినియోగదారులున్నారు. వీరిలో కిలోవాట్ వరకు గృహ విద్యుత్‌లో రిజిస్టరు చేయించుకున్నవారు సుమారు 46 వేల మంది వరకు (మిగతా 8వ పేజీలో)

మీ సహకారం కావాలి..

- ప్రధాని మోదీని కోరిన ఎంపీ పుట్టా

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

'ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో మీ దృష్టికి తెచ్చిన వెంటనే ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యాయి. మరెన్నో గాడిన పడ్డాయి. మరిన్ని పనులపై సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నా'.. అని ప్రధాన నరేంద్రమోదీ దృష్టికి ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ తీసుకొచ్చారు. వివిధ అంశాలపై ఆంధ్రప్రదేశ్ ఎంపీలంతా సోమవారం ఢిల్లీలో ప్రధాని మోదీని కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఎదురుచూస్తున్న భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్ మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ సమస్యలను, పెండింగ్ ప్రాజెక్టులను కేంద్రం దృష్టికి తీసుకొచ్చామని, కేంద్ర మంత్రులు, అధికారులు సానుకూలంగా స్పందిస్తున్న విషయాన్ని ఎంపీ ప్రస్తావించారు. అనంతరం ఆయన మిగతా ప్రతినిధులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ 'కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైనుపై ఇటీవల రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ని కలిసినప్పుడు డీపీఆర్ తయారైందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. 12 ఆర్వోబీల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కైకలూరు నియోజకవర్గ పరిధిలో మరో నాలుగింటికి అనుమతి కోరుతూ రైల్వే మంత్రికి నివేదిక సమర్పించా. పొగాకు కొనుగోళ్లపై సీలింగ్ పరిమితి తొలగించాలని కేంద్ర వాణిజ్యమంత్రి దృష్టికి తీసుకు రాగా సానుకూలంగా స్పందించి, త్వరలోనే ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. పామాయిల్‌కు నిర్దిష్ట ధరను నిర్ణయించి ఆయిల్‌ఫామ్ రైతులను ఆదుకుంటామన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఏలూరు లోక్‌సభ పరిధిలోని సమస్యలను ప్రస్తావించడానికి ప్రయత్నిస్తున్నా' అని మీడియాకు తెలిపారు.



ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీకి బొకే అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎంపీ పుట్టా, ఇతర ఎంపీలు



భీమవరంలో ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

సమైక్యతను చాటుదాం

హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పశ్చిమ కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : యువత దేశ సమగ్రతను సమైక్యతను కాపాడే విధంగా కలిసికట్టుగా దేశాన్ని ఉన్నత స్థితిలో ఉంచాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జాతీయ జెండా పట్ల గౌరవభావాన్ని పెంపొందించడం లక్ష్యంగా కళాశాల విద్యార్థినీ విద్యార్థులతో 200 మీటర్ల భారత త్రివర్ణ పతాకంతో సోమవారం ఎస్‌ఆర్‌కెఆర్ కళాశాల నుంచి సాగిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. జెండా ఎగురవేసి ఐక్యతను ప్రదర్శించేందుకు ఈనెల 13 నుంచి 15 వరకు ఇళ్లు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలలో జెండాలను ఎగుర వేయాలన్నారు. ర్యాలీకి ముందు కళాశాల ఆడిటోరియంలో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డీవో కే.ప్రవీణ్ కుమార్ రెడ్డి, డీఈవో నారాయణ, భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, జిల్లా టూరిజం అధికారి అప్పారావు, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.



ప్రతీ ఒక్కరూ దేశభక్తిని చాటాలి : ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటుతూ నగరంలో ఇండోర్ స్టేడియం నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు 100 అడుగుల జాతీయ జెండాతో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇండోర్ స్టేడియం వద్ద తిరంగా ర్యాలీకి కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డిలు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో వారు మమేకం అయ్యారు. వెట్రిసెల్వి మాట్లాడుతూ దేశభక్తిని చాటుతూ ప్రతీ ఒక్కరూ హర్ ఘర్ తిరంగాలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. డీఎస్పీ పి.శ్రావణ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, సెట్వెల్ సీఈవో ప్రభాకర్ రావు, డీఎస్‌డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు. శనివారపుపేట జడ్పీహైస్కూల్ విద్యార్థులు, బీజేపీ నాయకులతో కలిసి 150 అడుగుల భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు.





కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు...పాల్గొన్న భక్తజనులు

వైభవంగా .. శ్రీవారి నిత్య కల్యాణం

ద్వారకాతిరుమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయంలో జరిగిన పవిత్రోత్సవాల సందర్భంగా నెలకొన్న నాలుగురోజుల విరామం అనంతరం నిత్యార్జిత కల్యాణం సోమవారం ఆలయ కల్యాణమండపంలో అంగరంగ వైభవంగా జరిగింది. 86 జంటలు పాల్గొని శ్రీవారి కల్యాణవైభోగాన్ని వీక్షించారు. నాలుగు రోజులుగా నిత్యార్జిత కల్యాణాలు రద్దు అవడంతో విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో తొళక్కి వాహనంపై స్వామి, అమ్మ వార్లను ఉంచి అట్టహాసంగా కల్యాణవేదిక వద్దకు తెచ్చారు. అనంతరం శ్రీవారిని, అమ్మవార్లను రెండు వేర్వేరు బంగారు సింహాసనాలపై ఉంచి అలంకరించారు. అర్చకులు కల్యాణతంతుని ప్రారంభించారు. భక్తుల గోవిందనామ స్మరణలు, మేళతాళాలు. అర్చకుల వేదమంత్ర ఘోషల నడుమ మాంగల్య దారణ, తలంబ్రాలు జరిగాయి.

19 నుంచి సుందరగిరిపై పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై స్వయంవ్యక్తునిగా కొలువుదీరిన లక్ష్మీనారసింహుని వైభవాన్ని మరింతగా చాటేలా తొలిసారి దివ్య పవిత్రోత్సవాలు నిర్వహించేందుకు దేవస్థానం శ్రీకారం చుట్టింది. స్మార్త ఆగమం ప్రకారం ఈనెల 19 నుంచి మూడు రోజులు పాటు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ఎంతో ఎత్తైన కొండపై స్వామివారు వెలిసి భక్తులను కటాక్షిస్తున్నారు.పురాణ ప్రాశస్త్యం కల్గిన ఈ ఆలయం శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయంగా మండలంలోని ఐఎస్ జగన్నాధపురంలో విరాజిల్లుతోంది. ప్రతీ ఏటా ఇక్కడ కల్యాణ మహోత్సవాలు, మహా శివరాత్రికి హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట నరసింహగురూజీ ఆధ్వర్యంలో సుదర్శన మహాహోమాన్ని నిర్వహించడం పరిపాటి. తాజాగా పవిత్రో త్సవాలు జరిపేందుకు దేవస్థానం నిర్ణయించింది. ఏడాదిలో ఆలయంలో



ఈనెల 19న ఉదయం మహాగణపతి పూజ, పుణ్యహావాచన, రుత్విగ్వరణ, మండ పారాధన, అంకురార్పణ, అధి వాసాలు, నీరాజన మంత్ర పుష్పాలు జరు గుతాయి. ఈనెల 20న నిత్య హోమం, బలిహరణ, మూలమంత్ర హోమాలు, అభిషేకాలు, పవిత్రారోపణ. జరుగనున్నాయి. ఈనెల 21న మహాశాంతి హోమం, పౌష్టిక హోమం, మహా పూర్ణాహుతి హోమం, పవిత్ర విసర్జన, శాంతి కల్యాణంతో పవిత్రోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.



వాణిజ్యం విలవిల





ట్రంప్ సుంకాల ప్రభావం

ట్రంప్ సుంకాల ఎఫెక్ట్ వాణిజ్య రంగాలపై తీవ్ర ప్రభావమే చూపుతోంది..ఆక్వాతో పాటు రియల్ ఎస్టేట్, బంగారు నగల వ్యాపారం ఇరకాటంలో పడుతున్నాయి.. రొయ్యల సాగులో వచ్చిన లాభాలను చాలామంది రియల్ ఎస్టేట్‌లో పెడతారు.. అలాగే బంగారం కొంటుంటారు.. అసలే అంతంత మాత్రంగా ఉన్న ఈ రంగాలు ఇప్పుడు ట్రంప్ సుంకాల దెబ్బకు విలవిల్లాడుతున్నాయి..

రియల్ ధమాల్

వెలవెలబోతున్న బంగారం వ్యాపారం
ఉపాధి కోల్పోతున్న ప్రజలు, చిరు వ్యాపారులు



ఆకివీడు రూరల్ ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లుగా నష్టాల బాటలో ఉన్న ఆక్వా రంగంపై ట్రంప్ సుంకాలు మరింత నష్టాల ఊబిలోకి నెట్టాయి. ఇప్పటికే వాతావరణం, వ్యాధులు, సీడ్, ఫీడ్‌ల ధరల కారణంగా ఆక్వా రంగం నష్టాల బాటలో ఉండగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకంతో మరింత నష్టాల ఊబిలోకి వెళ్లింది. ఆక్వా రంగం మంచి ఊపుమీద ఉన్నప్పుడు వెలుగువెలిగిన రియల్ ఎస్టేట్, బంగారం వ్యాపారం, భవన నిర్మాణ రంగాలు నేడు వెలవెలబోతున్నాయి. ఆక్వారంగం నుంచి వచ్చే లాభాలతో రియల్ ఎస్టేట్, బంగారం, భవననిర్మాణ రంగంలో పెట్టుబడి పెట్టేవారు. ఆక్వారంగం విపరీత మైన లాభాలు ఆర్జించే సమయంలో ఆయా వ్యాపారాలు వృద్ధి చెందాయి. 4 ఎకరాల చెరువు ఉన్న రైతు 90 రోజులు కాలంలో 10 నుంచి 20 లక్షలు వరకు ఆర్జించేవారు. విస్తీర్ణం పెరగడం, నాణ్యమైన నీరు, సీడ్, ఫీడ్ లభించకపోవడం, వ్యాధులు ప్రబలడం వల్ల నష్టాలు ప్రారంభమయ్యాయి.గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న చర్యలు వల్ల ఆక్వారంగం సంక్షోభంలోకి వెళ్లింది. ఇప్పుడిప్పుడే కోలుకుంటుదనుకుంటున్న సమయంలో ట్రంప్ విధించిన సుంకంతో నష్టాల ఊబిలోకి నెట్టబడింది. ఆక్వారంగంపై ఆధారపడి ఉన్న కూలీలు, బడ్డీ కొట్లు, టిఫిన్ సెంటర్లు వెలవెలబోతున్నాయి.

• రియల్ ఎస్టేట్ పతనం



ఆక్వా రంగం నుంచి వచ్చిన లాభాలను ఎక్కువగా రియల్ ఎస్టేట్ రంగంలోకి మళ్లించేవారు. స్థలాలు కొనుగోలు చేసేవారు. 2019 నుంచి ఆక్వా రంగం నష్టాలబాట పట్టింది.గత ప్రభుత్వ నిర్ణయాలు ఆక్వాను పాతాళానికి నెట్టేసింది. దీంతో స్థలాలు కొను గోలు చేసేవారు కరువయ్యారు. భవన నిర్మాణాలు ఆగి పోయాయి. కొనుగోలు చేసేవారు తగ్గిపోయేసరికి ఒక్కసారిగా ధరలు తగ్గి పోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కొనుగోళ్ళు ప్రారంభమవుతున్నాయి, ఆక్వారంగం బాగుంది అనుకునేలోపు ట్రంప్ దెబ్బకి రెండు నెలలుగా నిశ్శబ్ద వాతావరణం నెలకొంది.

- కర్రి రాము, రియల్ ఎస్టేట్ వ్యాపారి, ఆకివీడు

• మా జీవనోపాధికే ఇబ్బంది



ఆక్వారంగం ఊపుమీద ఉన్నప్పుడు బంగారానికి విపరీతమైన డిమాండ్ ఉండేది. కనీసం భోజనం చెయ్యడానికి కూడా ఖాళీ ఉండేది కాదు. ఆభరణాలకు అనేక ఆర్డర్లు వచ్చేవి. రాత్రి పగలు తేడా లేకుండా ఆభరణాలు తయారు చేసేవాళ్ళం. జీవ నోపాధి బాగుండేది. ప్రస్తుతం బంగారం కొనుగోళ్లు తగ్గిపోయాయి. వరలక్ష్మీ వ్రతానికి మహిళలు అధిక ప్రాధాన్యం ఇస్తారు, అమ్మ వారి రూపులు కొనుగోలు తగ్గిపోయాయి. పైగా ట్రంప్ దెబ్బతో మా జీవనోపాధి దెబ్బతినే ప్రమాదముంది.

- పట్నాల బసవాచార్యులు, గోల్డ్ వర్కర్, ఆకివీడు

• కత్తి మీద సాములా బాకీల వసూలు



ఆక్వారంగంలో ఫీడ్, సీడ్స్ ప్రధానమైనవి. నష్టాలు వస్తుం డటంతో తగ్గిపోయాయి. సాధారణంగా రొయ్యల సాగు చేసుకోవడానికి ఫీడ్, సీడ్స్ అరువుకు ఇస్తారు. ఉత్పత్తి వచ్చిన తరువాత చెల్లిస్తుంటారు. రైతులు నష్టాలు పాలవుతుండటంతో చెల్లింపులు తగ్గిపోయాయి. మార్కెట్‌లో అనేక రకాల కంపెనీలు ఉన్నాయి. ఫీడ్ వ్యాపారం 50% తగ్గించేసి, బాకీలు వసూలులో పడ్డారు. కోట్లాది రూపాయలు పెట్టుబడులు పెట్టి కొద్దికొద్దిగా వచ్చినకాడికి వసూలు చేసుకునే పరిస్థితి నెలకొంది. ట్రంప్ దెబ్బతో మరింత ఆందోళన పెరిగింది.

- చుండూరి నరేంద్ర, ఆక్వా ఫీడ్ వ్యాపారి

ఆక్వా కుదేలు

గణపవరం/ కాళ్ల / ఆకివీడు/ ముదినేపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఆగ్రహం ఆక్వారంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దేశంలో పండిన రొయ్యల్లో సింహభాగం అమెరికాకు ఎగుమతి అవ్వడమే ఇందుకు కారణం. ట్రంప్ సుంకాల దెబ్బకు రొయ్యసాగు విలవిలాడుతోంది. ఎగుమతులు నిలిచిపోవడంతో ధరలు పతనమవుతున్నాయి. జిల్లాలో లక్షా 20 వేల ఎకరాల్లో రొయ్యల సాగు నిర్వహిస్తున్నారు. పంట చేతికి వచ్చే దశలో ఊహించని సుంకాల దెబ్బకు రైతులు కుదేలవుతున్నారు. వారం రోజుల క్రితం 100 కౌంట్ రొయ్య కిలో రూ.270 ఉండగా ఇప్పుడు రూ.220కి కొనుగోలు చేస్తున్నారు. మిగగిలిన కౌంట్లు కూడా కిలోకి రూ.50 చొప్పున ధర తగ్గటంతో ఎకరానికి సుమారు రూ.2 లక్షలు నష్టం వాటిల్లు తుందని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో సాగు విస్తీర్ణం తగ్గించుకునే యోచనలో రైతులు ఉన్నారు. సాగు తగ్గటం ద్వారా రైతులతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి రంగాలపై ప్రభావం చూపనుంది.

• రెండేళ్లుగా నష్టాల బాటే



12 ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నాను. సుంకాల పెంపుతో తీవ్ర నష్టాలను చవి చూస్తున్నాం. దీనికి తోడు సాగులో ఖర్చులు పెరిగిపోయాయి. ఇప్పటికే నాణ్యతలేని సీడు వల్ల నష్టాల పాల వుతున్నాం. ఒకపక్క లీజులు, మరోపక్క నిర్వహణ ఖర్చులు, విద్యుత్ బిల్లులలతో సతమతం అవుతున్నాం. ట్రంప్ దెబ్బకు మరింత ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయి అప్పులపాలవుతున్నాం. ప్రస్తుతం ఇదే పరిస్థితి కొనసాగితే సాగును విరమించుకుంటాం.

-మాల్యాద్రి యాదవ్, రొయ్యరైతు, గణపవరం

• రొయ్య ధర దారుణంగా పతనం



15 ఎకరాలు సాగు చేస్తున్నాను. ఇందులో 5 ఎకరాలు పంట చేతికి వచ్చింది. ఆశాజనకంగా ఉందన్న ఆనందంపై ట్రంప్ సుంకాలు నీళ్లు జల్లాయి. ఎగుమతులు నిలిచాయి. కొనేనాధుడే లేడు.సరుకుకు పెట్టిన డబ్బులు కూడా రావడం లేదు. రొయ్యల సంఘం నాయకులతో కలిసి ముఖ్యమంత్రి దృష్టికి సమస్య తీసుకెళ్లనున్నాం.

- కూసంపూడి సురేంద్ర కుమారరాజు, రొయ్యరైతు, గణపవరం

• ప్రభుత్వాలు రాయితీలు ఇవ్వాలి



ఏ దేశం టాక్స్ విధించినా నష్టపోవాల్సింది ఆక్వా రైతులే. అక్కడ టాక్స్ అమలు ఉన్నా లేకున్నా ఇక్కడ ఎగుమతిదారులు రైతులను నిలువు దోపిడీ చేసి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. వంద కౌంటు రొయ్యలను ఇష్టారాజ్యంగా తక్కువ ధరలకు కొనుగోలు చేసి రైతులకు ఆర్థికంగా నష్టం చేకూరుస్తున్నారు. ప్రభుత్వాలే ఆక్వా రైతులకు రాయితీలు ఇచ్చి ఆదుకోవాలి.

- అల్లూరి దొరయ్య చౌదరి, ఆక్వా రైతు, ఆనందపురం, కాళ్ళ మండలం

• ఇష్టానుసారంగా ధరలు తగ్గించేస్తున్నారు



ట్రంప్ టాక్స్‌ల పేరుతో ఇక్కడి వ్యాపారులు రొయ్య ధర కిలోకు అమాంతం రూ. 30 వరకూ తగ్గించేశారు. ఈ ధరకు అమ్ముకుంటే రైతులు కోలుకోలేని విధంగా నష్టాల పాలవుతారు. ఇప్పటికే సీడ్, ఫీడ్ ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న రైతులకు ఇది కోలుకోని దెబ్బ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై కఠిన నిర్ణయాలు తీసుకుంటే తప్ప ఆక్వా సాగు సంక్షోభం నుంచి బయటపడే పరిస్థితులు లేవు.

- కఠారి వెంకట నరసింహరాజు, రైతు, పెద అమిరం



రొయ్య రైతుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ పాల్గొన్న రైతులు

రైతుల ప్రయోజనాలే ముఖ్యం

అమెరికా సుంకాలు తాత్కాలికమే
కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ స్పష్టీకరణ

భీమవరం టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల ప్రయోజనాలే ముఖ్యమని, త్వరలో అమెరికా ప్రభుత్వం విధించిన సుంకాల సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉందని కేంద్ర,ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఆక్వా రైతులు సోమవారం భీమవరంలోని బీజేపీ కార్యాలయంలో వర్మతో సమావేశమయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా రొయ్య రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రైతులు తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రం సమర్పించారు. వర్మ మాట్లాడుతూ, తాను కూడా గతంలో రొయ్యల సాగులో రూ. కోట్ల నష్టాన్ని ఎదుర్కొన్నానని, రైతుల కష్టాలు తనకు తెలుసని అన్నారు. ఆక్వా రంగం రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తున్నందున, ఈ రంగానికి నష్టం వాటిల్లితే మార్కెట్‌లోని ఇతర రంగాలపై కూడా ప్రభావం పడుతుందన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని, గతంలో ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు కేంద్రం తీసుకున్న చర్యల ద్వారా సమస్య పరిష్కారమైందని, ఇప్పుడు కూడా అలాంటి చర్యలే తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఆక్వా రైతులకు జోన్‌లతో సంబంధం లేకుండా సబ్సిడీపై విద్యుత్, తక్కువ ధరకు ఫీడ్ సరఫరా వంటి అంశాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. వారితో సమావేశాన్ని కూడా ఏర్పాటు చేస్తానని చెప్పారు. అమెరికా విధించిన పన్ను తాత్కాలికమేనని, త్వరలో ఉపసంహ రించుకునే అవకాశం ఉందన్నారు. సమా వేశంలో ఎస్. గజపతిరాజు, జీవీ సుబ్బరాజు,తోట విజయ్ కుమార్, పేరిచర్ల సుభాష్ రాజు, పంజా వెంకటేశ్వరరావు, కలిదిండి వినోద్‌వర్మ పాల్గొన్నారు.

• కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవాలి



అసలే నాణ్యమైన సీడ్ లభించడం లేదు. వాతావరణ మార్పులు, ఫీడ్ అధిక ధరలతో పాటు పెరిగిన లీజులతో ఐదేళ్లుగా రైతలు ఆక్వా సాగును విరమించుకుంటున్నారు. ట్రంపు సుంకా లతో కనీవినీ ఎరుగని సంక్షోభం రైతులు ఎదుర్కొవలసి వచ్చింది. చెరువులు ఎండ బెట్టుకొనే రోజులు తలెత్తుతున్నాయి. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవాలి.

బి.ఆతీఫ్, ఆక్వా రైతు, ఆకివీడు

• దేశీయ మార్కెట్‌పై దృష్టి పెట్టాలి



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల పెంపు దెబ్బ ఆక్వా రంగాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రొయ్యలకు దేశీయ మార్కెట్‌ను అభివృద్ధి చేయాలి. అమెరికా లాంటి ఇతర దేశాలకు ఎగుమతులు చేయడంపైనే ఆధార పడకుండా దేశంలోనే రొయ్యలకు గిట్టుబాటు ధరలు లభించేలా ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించాలి. అమెరికా సుంకాల ప్రభావం తగ్గించేందుకు ఆక్వా రైతులకు రాయితీలు కల్పించాలి.

- గుడివాడ వేణు, ఆక్వా రైతు, పెదగొన్నూరు, ముదినేపల్లి మండలం




కాళ్ళలో రాష్ట్రీయ రహదారిపై గుంతలు పూడుస్తున్న దృశ్యం

గోతులు పూడ్చారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాళ్ళ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వందలాది వాహనాలు వెళ్లే రహదారిపై ఏర్పడ్డ గోతిలో పడి పదుల సంఖ్యలో వాహనదారులు గాయాల పాలవుతున్నారంటూ 'ప్రాణాలు పోవాల్సిందేనా...?' శీర్షికతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల కేంద్రమైన కాళ్ళ గ్రామంలో రాష్ట్రీయ రహదారిపై ఏర్పడ్డ గుంతలను డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో పంచాయతీ అధికారులు సోమవారం హుటాహుటిన జేసీబీ ఏర్పాటుచేసి గోతులను సరిచేసి రాళ్ళతో పూడ్చారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించడంతో ప్రయాణికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

గ్రంథాలయాలు..విజ్ఞాన భాండాగారాలు



విద్యార్థులు, నిరుద్యోగ యువతకు బాసటగా లైబ్రరీలు
నేడు జాతీయ గ్రంథాలయ దినోత్సవం



ఏలూరు టూటౌన్,ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో గ్రంథాలయాలకు గుర్తింపు తెచ్చిన మహనీయుడు డాక్టర్ ఎస్‌ఆర్ రంగనాథన్ గ్రంథాలయాలు స్థాపించి మార్గదర్శకంగా నిలిచిన మహోన్నతుడు, గ్రంథాలయ ఉద్య మంలో కీకలపాత్ర పోషించిన డాక్టర్ ఎస్‌ఆర్ రంగనాథన్ 1892 ఆగస్టు 12న చెన్నైలో జన్మించారు. గ్రంథాలయాల పరిపుష్టి కోసం ఆహర్నిశలు శ్రమించి ఎన్నో గ్రంథాలయాలు స్థాపించారు. ఆయన పుట్టినరోజును జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ప్రజల ఉపయోగార్థం అన్నిరకాల పుస్తకాలను ఒక చోటచేర్చి పరిరక్షించే ప్రదేశాన్ని గ్రంథాలయాలు అంటారు. గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు పేరొందాయి. ఎందరో విద్యార్థుల భవితకు గ్రంథాలయాలు బంగారు బాటలు వేశాయి. విద్యార్థులు గ్రంథాలయాలను అలవాటు చేసుకుని ఉన్నత శిఖాలు అధిరోహించారు.

74 లైబ్రరీలు..70 వేల పుస్తకాలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 74 గ్రంథాలయాలు ఉన్నాయి. గ్రేడ్ వన్ లైబ్రరీలు ఐదు, గ్రేడ్-2 మూడు, గ్రేడ్- 3 లైబ్రరీలు 66 ఉన్నాయి. ఈ గ్రంథాలయాలు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయి. అన్ని లైబ్రరీల్లో 70 వేల పుస్తకాలున్నాయి. ఏలూరు కేంద్ర గ్రంథాలయంలో దాతల సహకారంతో కేవలం 30 వేలు రూపాయలు విలువ గల పోటీ పరిక్షలకు సంబంధించి కొత్త పుస్తకాలు కొనుగోలు చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఏలూరులో మొబైల్ లైబ్రరీ ప్రారంభించారు. దాతలు పుస్తకాలు కొని వీటిలో ఉంచవచ్చు. ప్రజల ఇళ్లల్లో ఉన్న పుస్త కాలు కూడా వాటిలో ఉంచేందుకు వెసులు బాటు కల్పించారు. రద్దీ ఎక్కువగా ఉన్న కూడళ్లలో వీటిని ఉంచారు. రోడ్డుపై వెళ్లే వారుకానీ, విద్యార్థులు, నిరుద్యోగ యువత కానీ వాటిలోని పుస్తకాలను తీసుకుని చదువుకుని మరలా వాటిలో పెట్టి వెళ్లిపోవచ్చు. ఏలూరు జిల్లా గ్రంథాలయంలో ప్రతీ రోజు 200 మంది నిరుద్యోగులు కాంపిటేటీవ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అవుతుంటారు. గతంలో ఎంతో మంది ఇక్కడ చదువుకునే గ్రూప్-1, గ్రూప్-2 అధికారులు అయ్యారు. ఉమ్మడి జిల్లాలో లైబ్రరీలో ఉన్న 70 వేల పుస్తకాలను డిజిటలైజేషన్ చేశారు. ఈ పుస్తకాలను ఇంటిలో కూర్చుని సెల్‌ఫోన్‌లో కానీ, సిస్టమ్‌లో కానీ ఈ-గ్రంథాలయం అనే గూగుల్‌లో ఓపెన్ చేసుకుని చదువుకోవచ్చు. నిరుద్యోగుల కోసం గ్రంథాలయంలో నెట్ సెంటర్‌ను కూడా ఓపెన్ చేశారు. నిరుద్యోగులు వచ్చి నెట్ సెంటర్‌ను వినియోగించుకునేందుకు వీలు కల్పించారు.

నులిపేద్దాం..

నులి పురుగుల వల్ల అనర్థాలెన్నో
నివారణకు నేడు మాత్రల పంపిణీ



నిడమర్రు ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : తమ పిల్లలు ఎదగడం లేదని కొంతమంది తల్లులు తరచు డాక్టర్లను సంప్రదిస్తూంటారు. ఎంత తిన్నా చిక్కిపోతున్నాడని, నీరసంగా ఉంటు న్నాడని చెబుతుంటారు. పిల్లలు అన్నం సరిగా తినడం లేదని కూడా కంప్లైట్స్ చేస్తూంటారు. దీనికి ప్రధాన కారణం చిన్న పిల్లలలో వారి ఆహారపు అలవాట్లు వల్ల నులి పురుగులు ఏర్పడి పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపె డుతున్నాయి. పెద్దల జీర్ణాశయ సమస్యలకు కూడా ఈ నులిపురగులే ప్రధాన కారణంగా నిలుస్తున్నాయని డాక్టర్లు చెబుతున్నారు. నులి పురుగుల నివారణ దినం సందర్భంగా ఆగస్టు 12న తొలి విడత, ఆరోజు వేయని వారికి 20వ తేదీన మాత్రల పంపిణీ చేస్తారు. ఏలూరు జిల్లాలో 3,78,263 మంది విద్యార్థులు ఉండగా వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాల్సి ఉంది.

కారణాలు ఇవీ :

మన ఇంటి చుట్టూ ఉండే అపరిశుభ్రత వాతావరణమే నులిపరుగులు రావడానికి కారణం. ఇంటి పరిసరాలలో చెత్త పేరుకు పోవడం, నిల్వ ఉన్న ఆహారం తీసుకోవడం, పులిసిన పాల పదార్థాలు తీసుకోవడం వల్లే ఈ రోగం ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా తీపి పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం, ఉడికీ ఉడకని మాంసం తినడం, మలబద్దకం వల్ల కూడా నులి పురు గులు తయారవుతాయి. అంతే కాకుండా అన్నం తినేముందు, తిన్న తర్వాత చేతులు కడుక్కోక పోవడం కూడా ఒక కారణం. పిల్లలు తరచూ మట్టిలో ఆడుతూ అవే చేతులను నోట్లో పెట్టుకో వడం వల్ల నులి పురుగులు వ్యాప్తి చెందుతాయి.

లక్షణాలు ఇలా :

నులిపురుగులు కడుపులో ఉన్నాయనడానికి ప్రధాన సంకేతం మల ద్వారం వద్ద విపరీతమైన దురద వస్తుంటుంది. పొట్టలో నొప్పి, అజీర్ణం, వాంతులు, విరేచనాలు, రక్తహీనత, లాంటి లక్షణాలు కనబడతాయి. జీర్ణక్రియ పూర్తి మందగిస్తుంది. వికారం, వాంతులు, కలత నిద్ర, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు ఎక్కువగా కనబడతాయి. ముఖ్యంగా పిల్లలలో పెరుగుదల పూర్తి మందగిస్తుంది. తిన్న ఆహారం రక్తంగా మారదు. మలబద్దకం వస్తుంది. శరీరం రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తగ్గిపోతుంది.



తీసుకోవల్సిన జాగ్రత్తలు :

ఏలిక పాములు, నులిపురుగులు, కొంకి పురుగులు అనే మూడు రకాలుగా ఉంటాయి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటిలో గాలి, వెలుతురు దారాళంగా వచ్చేలా ఉండాలి. కాచి చల్లార్చిన నీరు తాగాలి. ఆహారం తీసుకొనే ముందు , తీసుకొన్న తర్వాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. చేతి గోళ్లలో మట్టి చేరకుండా ఉండడం కోసం ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. వేడి ఆహారం తీసుకోవాలి. మాంసాహారం పూర్తిగా ఉడికిన తర్వాత వేడి వేడిగా భజించాలి. పిల్లలు తీపిపదార్థాలైన చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లు ఎక్కువగా తినకుండా చూసుకోవాలి. కూరగాయలు, పండ్లు స్వచ్ఛమైన నీటితో కడుక్కొన్నాకే వండాలి.

పంపిణీకి యాక్షన్ ప్లాన్ సిద్ధం



1 నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం మాత్రలు పంపిణీకి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకొన్నాం. జిల్లా వ్యాప్తంగా సుమారు 3,78, 263 మంది పిల్లలకు అల్బెండజోల్ టాబ్లెట్లు పంపిణీ చేయాల్సి ఉంది. వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు ఆశ, అంగన్వాడీ, విద్యాశాఖ సహ కారంతో సమన్వయంతో నిర్వహిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలల్లో, ఇంటర్మీడియట్ కళాశాలలు, డిగ్రీ కళాశాల విద్యార్థులకు టాబ్లెట్లు అందించనున్నాం. **- డాక్టర్ పీజే అమృతం డీఎంహెచ్‌వో, ఏలూరు**



ఆరిమిల్లి, నిమ్మల, శ్రీనివాసవర్మలను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

వైసీపీ పాలనలో వ్యవసాయం మూతపడింది

మంత్రి నిమ్మల రామానాయుడు

ఘనంగా తణుకు ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

తణుకు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):గత వైసీపీ పాలనలో అన్నం పెట్టే రైతులు వ్యవసాయానికి మూత వేశారని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం సాయంత్రం తణుకు వికె కన్వెన్షన్ హాలులో తణుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు పాలనలో రైతులు వ్యవసాయం ఎంతో లాభసాటిగా చేశారని గుర్తు చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ, రుణమాఫీ, యాంత్రీకరణ పరికరాలు ఇచ్చారని తెలిపారు. గతంలో కనీసం పండించిన పంటను అమ్ముకునే పరిస్థితి ఉండేది కాదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక రైతు కోరుకున్న చోట ధాన్యం అమ్ముకునే స్వేచ్ఛ ఇచ్చామన్నారు. అమ్మిన 48 గంటలో ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ క్రేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు వల్ల అభివృద్ధి, సంక్షేమం పెద్ద ఎత్తున జరుగుతుందన్నారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ కార్యకర్తలకు రానున్న రోజుల్లో మరిన్ని పదవులు వస్తాయని చెప్పారు. అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ కూటమి శ్రేణులకు అన్ని నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పించామన్నారు. ఏఎంసీ చైర్మన్‌గా కొండేటి శివతో పాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, పీతల సుజాత, తోట సీతారామలక్ష్మి, ఐ.శ్రీదేవి, కలగర వెంకటకృష్ణ, దొమ్మేటి సుధాకర్, బసవా రామకృష్ణ, మంత్రి రావు వెంకటరత్నం, వావిలాల సరళాదేవి కూటమి నాయకులు పాల్గొన్నారు.



చైర్మన్ బ్రహ్మాజీని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ ఏఎంసీ సభ్యుల ప్రమాణ స్వీకారం

పెనుగొండ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వం రైతులకు చుక్కలు చూపించిందని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని కేంద్ర సహాయ శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పెనుగొండలో మార్కెట్ యార్డ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం రాత్రి నిర్వహించారు. పితాని సత్యనారాయణ మాట్లాడుతూ అధికార దాహంతో ఐదేళ్ల కాలంలో అన్ని వర్గాలకు అణగదొక్కిన జగన్మోహన రెడ్డి బడుగు బలహీన వర్గాలపై దాడులు చేయించారన్నారు. ఏలూరు శాసన సభ్యుడు బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాలకు పెద్దపీట వేస్తోందన్నారు. మాజీ మంత్రి అనంతరం పెనుగొండ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా బడేటి వీరబ్రహ్మం (బ్రహ్మాజీ) వైస్‌చైర్మన్‌గా శీలం బాబి భాస్కర్, సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. పీతల సుజాత, శ్రీదేవి, కరాటం రాంబాబు, మంతెన రామరాజు, బండారు మాధవనాయుడు, కొత్తపల్లి సుబ్బారాయుడు, వేదవ్యాస శాస్త్రి, శ్యామలా సోని, నానాజీ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీ ఉమ్మడి జిల్లా విజేతలు వీరే

ఏలూరు అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని 'గాంధీజీ ఆశించిన సురాజ్యం' అనే అంశంపై ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాస్థాయిలో సర్వోదయమండలి ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల బాలబాలికలకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలైన వారివివరాల జాబితాను సర్వోదయమండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు సోమవారం విడుదల చేశారు. మొత్తం 18 రచనలను ఉత్తమమైనవిగా ఎంపిక చేయగా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందినవారికి ఈనెల 13న పెదఅమిరం మహాత్మాగాంధీ ట్రస్టునందు, ఏలూరు జిల్లావారికి 14న పెదనింద్రకొలను మహాత్మాగాంధీ భవన్‌లో నిర్వహించే కార్యక్రమాల్లో బహుమతులందజేస్తామని వివరించారు. పాఠశాలల విభాగం సీనియర్స్ విజేతలుగా ఎం.నాగలక్ష్మి (గోపాలపురం), ఎండీ సుమయ్య (నర్సాపురం), ఎ.పూజిత (చినఅమిరం), పి.మంజుశ్రీ (గూట్లపాడు), కె.ఎస్.అమూల్య (వై.ఎస్.పాలెం), కె.రిషిత(కె.ఎస్.రామవరం), కె.దివ్య (మండపాక), ఎస్.అమృత లక్ష్మీసాయి (చిననింద్రకొలను). జూనియర్స్ విభాగం విజేతలుగా కె.కుశాలి (బొర్రంపాలెం), డి.కోమలశ్రీ (వేగివాడ కళ్లచెరువు), కె.యామిని ఐశ్వర్య (నర్సాపురం),అక్షిత (చినఅమిరం), ఎ.వరసాదేవి (అరట్లకట్ల), కె.వర్షిత (భీమవరం), పి.ఆనందిత (పెద నింద్రకొలను). కళాశాలల విభాగం విజేతలుగా ఎం.విజయమణి (తాడే పల్లి గూడెం), ఇ.వరుణ్ (పెన్నాడ),అవినాష్ (భీమవరం) నిలిచారని వివరించారు.

ఎంఈవో లాగిన్ల నుంచి ప్రైవేటు పాఠశాలల డేటా చోరీ

ఏలూరు అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):రాష్ట్రవ్యాప్తంగా వున్న ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల డేటాను ఫోన్ నంబర్లతో సహా ఎంఈవో లాగిన్‌ల నుంచి కార్యాలయాల సిబ్బంది చట్టవిరుద్ధంగా చోరీచేసి కార్పొరేట్ విద్యాసంస్థల మార్కెటింగ్ ఏజెంట్లకు చేరవేస్తున్నారని, ఇటువంటి అనైతిక విధానాలవల్ల బడ్జెట్ ప్రైవేటు విద్యాసంస్థలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం(అపుస్మా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బి.ఎస్ శర్మ ఆరోపించారు. ఏలూరులో జరిగిన సంఘ కార్యవర్గ సమావేశంలో చేసిన వివిద తీర్మానాలను సోమవారం మీడియాకు విడుదల చేశారు. ఎంఈవో లాగిన్‌ల నుంచి డేటాచోరీ నివారణకు తగిన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఇప్పటికే అభ్యర్థించామని, తగిన చర్యలు తీసుకోకపోతే సాక్ష్యాధారాలతో కోర్టులో కేసు దాఖలు చేయడానికి నిర్ణయించామన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను విద్యాహక్కు చట్టం 12(1)సి నిబంధన మేరకు కేటాయిస్తున్న ప్రభుత్వం నిర్ణీత అడ్మిషన్లు పొందిన బాలబాలికలకు తల్లికి వందనం ఆర్థికసాయాన్ని వర్తింప జేయకపోవడంతో చేరినవారిలో పలువురు వెళ్లిపోవడం లేదా అసలు జాయిన్ కాకపోవడం జరుగుతోందని దీనిపై తగిన స్పష్టత ఇవ్వాలని కోరారు.ఈ నెల 16న చీరాలలో జరుగనున్న అపుస్మా రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి జిల్లా కార్యవర్గమంతా హాజరుకావాలని కోరారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS క్లాసిఫైడ్స్ (ప్రతిరోజూ)

వధువు కావలెను

37 సంగల డైవర్స్ బిజినెస్ వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు లేదా చేదోడుగా ఉండానికి కావలెను. పిల్లలు వున్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు, నో డౌరీ సెల్: 6301943220, 8008440189
AJD:244776

PROPERTY FOR SALE

★ Commercial Hospital building for rent near old bus stand ELURU. contact: 9848112379, 8106799778
AJH-2771

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రమాణించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడిసిటి

ఏటీఎస్ వద్దు..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో లక్షలాది మంది చిన్నకార్లు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలను స్థానికంగా ఉన్న రవాణా శాఖ కార్యాలయంలో చేయించుకునేవారు. దీంతో సమయం, సొమ్ము కూడా ఆదా అయ్యేది. అయితే ఇప్పుడు ఏటీఎస్ విధానం తీసుకురావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తణుకు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఏటీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టింది. పైగా దీనిని ప్రైవేటు సంస్థకు అప్పగించింది. సంబంధిత సంస్థ జిల్లాకు ఒకటి, రెండు చొప్పున సెంటర్లు ఏర్పాటు చేసి మొత్తంగా వాహనాలను అక్కడకు రప్పించి పూర్తిగా మిషన్‌తో ఫిట్‌నెస్ పరీక్షలు చేయడం వల్ల ఒక్కో సందర్భంలో వాహనం కండిషన్ బాగున్నా అప్పటికప్పుడు పాడయ్యే పరిస్థితులు ఉన్నాయని రవాణా రంగ కార్మికులు వాపోతున్నారు. వెంటనే దీనిని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో చాలా మంది సొంత పేరుతో రిజిస్టర్ చేయించుకున్న నంబర్ ప్లేటుతో పాసింజర్లను ఎక్కించుకుని వ్యాపారం చేస్తున్నారు. దీంతో పాసింజరు కార్లకు టాక్సులు భారం పడుతోంది. అందరికీ సమాన టాక్సు అమలుచేయాలంటున్నారు.

ఏటీఎస్ అంటే...

ఏటీఎస్ అంటే ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్. ఫిట్‌నెస్ పరీక్షలను పూర్తిగా మనిషితో సంబంధం లేకుండా మిషన్ ద్వారా నిర్వహించే విధానం. దీని ద్వారా పరీక్షలు చేయడం వల్ల తమకు అన్యాయం జరుగుతుందని వాహనదారులు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు కొన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తున్నప్పటికీ, మరికొన్ని రాష్ట్రాల్లో అమలు చేయడం లేదు. మన రాష్ట్రంలో కూడా అమలు చేయవద్దని కోరుతున్నారు.

పాత పద్ధతే ముద్దు

- తప్పుడు నివేదికలతో చలాన్ల భారం
- తక్షణం విరమించుకోవాలంటున్న రవాణా రంగ కార్మికులు

ఇబ్బందులు ఇవే..

ఏటీఎస్ జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు. అదీ తూర్పు గోదావరి జిల్లాకు అనుకున్న గ్రామంలో నెలకొల్పాలని యోచిస్తున్నట్లు చెబుతున్నారు. సాధారణంగా అయితే ఎంవీఐ వద్దకు ఫిట్‌నెస్‌కు వెళితే వాహనాన్ని చూసి లోపాలు ఉంటే సరి చేసుకోవాలని చెప్పడం, సరి చేసుకోవడం, ఫిట్‌నెస్ చేయడం జరిగేది. ఈ ఏటీఎస్ విధానంలో అలా లేదు. ముందుగా చలానా తీసుకుని టెస్టింగ్‌కు వెళ్లాలి. మిషన్ టెస్టింగ్‌లు ఫెయిల్ అవుతున్న సందర్భంలో మరలా ఫిట్‌నెస్ ఓకే చెయించుకోవడానికి మరలా చలానా తీసుకోవాలి. ఇది అదనపు భారం. చలానా ధరలు గతంలోకి ఇప్పటికి బారీగా పెంచేశారు.

జిల్లాలో లక్షల మంది..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో చిన్న కార్లు నడుపుతూ జీవనం సాగిస్తున్న కార్మికులు లక్షల మంది ఉన్నారు. వీరంతా ఓనర్ కమ్ డ్రైవర్లుగా పనిచేస్తుంటారు. ప్రస్తుతం మారిన సమీకరణాలు వల్ల జీవనం భారంగా ఉందని పేర్కొంటున్నారు.

టోల్ గేటు రుసుం చెల్లింపులోను ట్రావెల్ వాహనాలుకు బాదుడు తప్పడం లేదు. సొంత వాహనాలు అయితే మూడు వేలు చెల్లించినట్లయితే సంవత్సరంలో 20 ట్రిప్పులు వరకు ప్రయాణించవచ్చు. అదే ట్రావెల్ అయితే ప్రతిరోజు టోల్ చెల్లించాలి. దీనిని భారం లేకుండా సొంత వాహనదారులకు మాదిరి వెసులు బాటు కల్పించాలి.

ఏటీఎస్ విధానాన్ని ఉపసంహరించాలి



కేంద్ర తీసుకొచ్చిన ఏటీఎస్ విధానాన్ని ఉపసంహరించాలి. దీని వల్ల వాహనదారులకు చాలా ఇబ్బందులు ఉన్నాయి. ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలి. పాత విధానంలోనే ఫిట్‌నెస్ పరీక్షలు రవాణా కార్యాలయంలో చేయాలి.

- రావి కృష్ణారావు, జేఏసీ నాయకుడు

వాహనమిత్ర అమలు చేయాలి



ఎన్నికల హామీ మేరకు ప్రతి వాహనదారుకు వాహన మిత్ర పథకం అమలు చేయాలి. పెంచిన టాక్సులు తగ్గించాలి. హరిత పన్నును రవాణా వాహనాలకు తగ్గించినట్లు కార్లుకు కూడా తగ్గించాలి. వీటిలన్నిన్ని సమస్యలు పరిష్కరించాలి.

- పేపకాయల సత్యనారాయణ, జేఏసీ నాయకుడు

చలానాల ధరలు తగ్గించాలి



వాహనాల బ్రేక్ సమయంలో చెల్లించే చలానాలు భారీగా పెంచడం జరిగింది. దీనివల్ల ఆర్థికంగా చాలా భారంగా మారింది. అందువల్ల పెంచిన ధరలను తగ్గించాలి. గతంలో రూ. 720 ఉంటే ప్రస్తుతం రూ. 920కు పెంచారు. ఒకేసారి రూ. 200 పెంచారు.

- శీలం శ్రీనివాసరావు, జేఏసీ నాయకుడు

రాయితీలు కల్పించాలి



ప్రభుత్వం సొంత వాహనాదారులకు ఇచ్చే రాయితీలు ట్రావెల్స్‌కు వర్తింప చేయాలి. ఎందుకంటే తొంభై శాతం సొంత పేర్లమీద రిజిస్టర్ చేయించి వ్యాపారం చేస్తున్నారు. నిజాయితీగా ట్రావెల్ బోర్డు పెట్టడం వల్ల భారీగా పన్నులు చెల్లిస్తున్నాం. కాబట్టి సమాన పన్ను విధానం అమలు చేయాలి.

- వర్రే సుబ్బారావు, జేఏసీ నాయకుడు



తాడేపల్లిగూడెంలో ఉద్యోగ సంఘాల నాయకుల ఆందోళన

ఐడీబీఐ ప్రైవేటీకరణ వద్దు

బ్యాంక్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ

తాడేపల్లిగూడెం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం విరమించుకోవాలని బ్యాంక్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి టీవీ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. నిర్ణయం విరమించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. తాడేపల్లిగూడెంలో బ్యాంక్ ఉద్యోగుల కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు సోమవారం చేపట్టిన నిరసనలో పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించారు. రాష్ట్ర నాయకులు టీవీ సూర్యనారాయణ, కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ 50 ఏళ్ల చరిత్ర కలిగి లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంక్ ప్రైవేటీకరణను విరమించుకోవాలని కోరారు. కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు బి. ఏడుకొండలు, జీఎస్‌వీ ప్రకాశ్, పాలూరి సత్యనారాయణ, కే శ్రీనివాస్, సిద్దాబత్తుల సూర్యనారాయణ, షరీఫ్ ఎం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద అధ్యాపకుల నిరసన

అధ్యాపకుల ఆందోళన

ఏలూరు అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):హామీ మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు సాధారణ బదిలీలు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ జీసీటీఏ (గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడు జి.రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో అధ్యాపకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పదోన్నతులు లేకుండానే చాలామంది అధ్యాపకులు ప్రస్తుత పొజిషన్లు, స్థానాల్లోనే ఉద్యోగ విరమణలు చేస్తున్నారని ఆరోపించారు. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం, రీ డిజిగ్నేషన్‌లపైనా సత్వర నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శనలో సంఘ జిల్లా కోశాధికారి టీ.వీ.దుర్గాప్రసాద్, కె.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: ప్రభుత్వ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక డిగ్రీ కళాశాలకు చెందిన అధ్యాపకులు భోజన విరామ సమయంలో కళాశాల ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బదిలీలు వెంటనే చేపట్టాలని, ఎయిడెడ్ అధ్యాపకులను ప్రభుత్వంలో విలీనం చేసిన జీవో నెం.42ను తక్షణమే రద్దు చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.మహేంద్రరావుకు వినతిపత్రం అందజేశారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

మాల్స్‌కు ఆర్టీసీ స్థలాలు వద్దు

భీమవరంటౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ స్థలాలను లులూ షాపింగ్ మాల్స్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో 137ను రద్దు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా రీజియన్ కార్యదర్శి అల్లం సత్యనారాయణ తెలిపారు. ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసి) ఆస్తులు ప్రైవేటు వ్యాపారవేత్తలకు ధారదత్తం చేస్తున్న చర్యలను ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడచినా డీఏ బకాయిలు ఇవ్వలేదని, 12వ పీఆర్సీ లేదు, ఐఆర్ లేదని ఆయన విమర్శించారు. ఆర్టీసీలో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడాన్ని పూర్తిగా స్వాగతిస్తున్నామని, విద్యుత్ బస్సులు, కొత్త బస్సులు కొనుగోలు చేసి, ఆర్టీసీలో రిక్రూట్‌మెంట్ జరిగితేనే మహిళలకు ఉచిత బస్సు విజయవంతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ నాయకులు ఎం.ఆర్.పి.రాజు, ఎం.సీతారాంప్రసాద్, చినమిల్లి శ్రీనివాసులు, బి.అరుణ, కె.ఎస్. రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

గుర్తు తెలియని వాహనం ఢీకొని రైతు మృతి



పద్మారావు మృతదేహం

పోలవరం,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని రైతు మృతి చెందిన ఘటన గూటాల గ్రామంలో సోమవారం జరిగిం ది. పోలవరం పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన జల్లేపల్లి అనంత పద్మారావు(57) అనే రైతు తన బైకుపై గ్రామం నుంచి తాళ్ళపూడి వైపు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అతడిని తాళ్ళపూడి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోలవరం సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యులను ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పరామర్శించి సంతాపం తెలిపారు.

కొడుకు కత్తితో నరికిన ఘటనలో..
చికిత్స పొందుతూ తల్లి మృతి

కొయ్యలగూడెం,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కొడుకు చేతిలో అతికిరాతకంగా కత్తితో నరికిన ఘటనలో తల్లి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆదివారం కొయ్యలగూడెంలో తల్లి జక్కు నర్సమ్మ(44)ను ఆమె కుమారుడు శివ కత్తితో నరికి గాయపరిచిన ఘటన తెలిసిందే. ఈమేరకు ఆమెను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి ఉన్నత వైద్యం కోసం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం ఆమె మృతి చెందింది. ఆమె కొడుకే ఇంత కిరాతకంగా చంపండపై ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఇల్లు అమ్మి డబ్బులు ఇవ్వాలని తరచూ గొడవ చేస్తుండేవాడని పోలీసులు తెలిపారు. ఆ ఇల్లు అమ్మేదిలేదని తల్లి చెప్పడంతో ఆమెను చంపడానికి సిద్ధపడినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసినట్టు తెలిసింది. ఏలూరు నుంచి వచ్చిన క్లూస్‌టీమ్ ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనకు పాల్పడిన ఆమె కొడుకును కఠినంగా శిక్షించాలంటూ ప్రజలు కోరుతున్నారు.

కత్తితో దాడి చేసిన ఇద్దరిపై కేసు

భీమవరం క్రైం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పాత గొడవలను పురస్కరించుకుని ఒక యువకుడిపై ఇద్దరు యువకులు కత్తితో విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన భీమవరం పట్టణంలో సోమవారం సంచలనమైంది. సుంకర పద్దయ్య వీధికి చెందిన నిమ్మల దేవ సాయికుమార్ వీరవాసరంలోని ఒక ప్రజాప్రతినిధి వద్ద విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే పట్టణానికి చెందిన వలవల గోపి, కోటిపల్లి సురేంద్ర ప్రేమసాగర్ అనే వారికి, సాయికుమార్‌కు పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం భీమవరం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సాయి కుమార్‌పై వారిద్దరూ కత్తితో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రగాయాలైన సాయికుమార్‌ను భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి వివరాల కోసం భీమవరం వన్‌టౌన్ పోలీసులను సంప్రదించగా ఎవరూ సరైన సమాధానం ఇవ్వకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది.

యనమదుర్రు డ్రెయిన్‌లో మహిళ మృతదేహం

భీమవరం క్రైం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):యనమదుర్రు డ్రెయిన్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని భీమవరం రూరల్ పోలీసులు కనుగొన్నారు. భీమవరం మండలం దెయ్యాలతిప్ప గ్రామం వద్ద సుమారు 35 నుంచి 40 ఏళ్ల మహిళ మృతదేహం డ్రెయిన్‌లో కొట్టుకు రావడంతో స్థానికులు గుర్తించారు. గ్రామ వీఆర్‌వో రత్నరాజుకు తెలపడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వీర్రాజు తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు నలుగురు బాల బాలికలు

- ఏలూరు జిల్లాలో ఆగస్టు ఒకటి నుంచి 'ఆపరేషన్ ట్రేస్' అమలు



ఏలూరులో బాలలను తల్లిదండ్రులకు అప్పగించిన ఏఎస్పీ సూర్యచంద్రరావు, సీఐ సుబ్బారావు

ఏలూరు క్రైం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమంలో భాగంగా నలుగురు బాలబాలికల ఆచూకీని కనుగొని తల్లిదండ్రులకు జిల్లా పోలీసులు సోమవారం రాత్రి అప్పగించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాలతో ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమాన్ని ఈనెల ఒకటో తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. చాలాకాలం నుంచి గవర్నమెంట్ హోమ్స్, ఎన్‌జీవో హోమ్స్‌లో ఉంటూ తప్పిపోయిన బాల బాలికల ఆచూకీని కనుగొనడం, వారి తల్లిదండ్రులను గుర్తించి బాలబాలికలను వారికి అప్పగించే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈనెల ఆరో తేదీన ఏలూరు శనివారపుపేటలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, శక్తి టీమ్ సభ్యులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న అధికారులు ఇద్దరు బాలల వివరాలను తెలియ జేశారు. అప్పటికే భీమవరం నుంచి ఇద్దరు బాలికల తప్పిపోయిన వివరాలు తెలిశాయి. ఈ క్రమంలో చెన్నై చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నుంచి ఈ నలుగురిని ఏలూరుకు గతనెల 31వ తేదీన పంపించారని వారి ఆచూకీ కనుగొనాలంటూ అధికారులు కోరారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు పర్యవేక్షణలో శక్తి టీమ్ భీమవరం చైల్డ్‌లైన్ సహకారంతో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికల ఆచూకీ కనుగొని వారి తల్లిదండ్రులను సోమవారం శనివారపుపేటలో ఉన్న ప్రభుత్వ బాలుర వసగతి గృహానికి తీసుకువచ్చి గుర్తించారు. సీడబ్ల్యూసీ ఆ బాల బాలికలను తల్లిదండ్రులకు అప్పగించాలని ఆదేశాలు జారీ చేయడంతో వారిని ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం రాత్రి ఇద్దరు బాలలను అప్పగించారు. బాలికలు భీమవరం వన్‌స్టాప్ సెంటర్‌లో ఉండడంతో అక్కడ ఆ బాలికల తల్లిదండ్రులకు అప్పగించారు. డీజీపీ ఉత్తర్వులతో, ఎస్పీ కిశోర్ ఆదేశాలతో నలుగురు బాలబాలికలను తల్లిదండ్రుల వద్దకు చేర్చడంతో వారి ఆనందానికి అవధులులేకుండా పోయింది. పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

14 మంది జూదరుల అరెస్ట్

- భారీగా నగదు, కార్లు, సెల్ ఫోన్‌ల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

ద్వారకాతిరుమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల మండలం దొరసానిపాడు శివారులో ఓ పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. స్థానికులు తెలిపిన వివరాలివి.. ఈ దాడుల్లో విజయవాడకు చెందిన 14 మంది జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకోగా, కొంతమంది కార్లలో పరారవుతుంటే వారిని వెంటాడి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 15 సెల్‌ఫోన్‌లు, రూ.1.23 లక్షల నగదు, పలు రకాల 93 కాయిన్లను, నాలుగు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కుమారుడి చెంతకు తల్లిని చేర్చిన పోలీసులు

ఆకివీడు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):తప్పిపోయిన తల్లిని కుమారుడుకి పోలీసులు అప్పగించారు. భీమవరానికి చెందిన కుండ మల్లేశ్వరి.. విజయవాడ ఏఎంసీలో పనిచేస్తుంది. ఆమెకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో వైద్యం చేయిస్తున్నారు. సోమవారం భీమవరం నుంచి తల్లిని కుమారుడు శరత్ విజయవాడ తీసుకెళ్లాడు. ఏఎంసీ పనులు చేసుకుని రైలులో భీమవరం తిరిగి వస్తుండగా ఆమె ఆకివీడులో దిగిపోయింది. కుమారుడు ఆకివీడు ఎస్ఐ హనుమంతు నాగరాజుకు ఫోన్ చేయగా కానిస్టేబుల్స్‌ను స్థానిక రైల్వే స్టేషన్‌కు పంపించారు. రైల్వే స్టేషన్ ఉన్న ఆమెను పట్టుకుని కుమారుడు శరత్‌కు ఫోన్ చేయగా ఆకివీడు వచ్చాడు. తల్లిని కుమారుడు శరత్‌కు అప్పగించడంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):కాలేజీకి వచ్చిన ఒక విద్యార్థి అదృశ్యమయ్యాడని ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ముసునూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన నందిగం పవన్‌సాయి ఏలూరు సీఆర్ఆర్ కాలేజీలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 7వ తేదీన కాలేజీకి వచ్చిన ఆ విద్యార్థి అదృశ్యమయ్యాడు. అతడి కుటుంబ సభ్యులు వెతికినప్పటికి ఆచూకీ కానరాకపోవడంతో సోమవారం ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గోదావరి ఉధృతి

స్వల్పంగా పెరిగిన గోదావరి

- పోలవరం నుంచి 1,45,797 క్యూసెక్కుల విడుదల

పోలవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):పోలవరంలో గోదావరి నీటిమట్టం సోమవారానికి స్వల్పంగా పెరిగింది. మూడు రోజులుగా ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలో నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతూ వస్తుంది. ప్రాజెక్టులోకి వస్తున్న 1,45,797 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్టు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. స్పిల్వే ఎగువన 27.550 మీటర్లు, స్పిల్వే దిగువన 17.680 మీటర్లు నీటిమట్టం నమోదైంది.

పట్టిసీమ నుంచి 708 క్యూసెక్కుల జలాలు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 708 క్యూసెక్కుల జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్టు సోమవారం జలవనరులశాఖ అధికారులు తెలిపారు. గోదావరి నీటిమట్టం సాధారణ స్థితికి మించి 14 మీటర్లకు పైబడి ఉండడం వల్ల రెండు మోటార్లు, రెండు పంపులతో నీటి విడుదల చేస్తున్నటుట ఈఈ యేసుబాబు తెలిపారు. రైతుల సాగునీటి అవసరాల రీత్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటిని విడుదల చేశామన్నారు.

15 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా

ఉండి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులో 15మందిని అరెస్ట్ చేసి సోమవారం భీమవరంలోని కోర్టుకు హాజరుపరిచామని ఎస్ఐ నజీరుల్లా తెలిపారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున 15 మందికి రూ.1.50 లక్షలను కోర్టు జరిమానా విధించిందని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

నేడు 'నులి పురుగుల నివారణ' విజయవంతం చేయాలి

భీమడోలు,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులందరికీ నులి పురుగు నివారణ మాత్రలు తప్పనిసరిగా పంపిణీ చేయాలని గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య వైద్యురాలు జాహ్నవి రెడ్డి సూచించారు. మంగళవారం జరిగే నులిపురుగు నివారణ కార్యక్రమం విజయవంతం చేయాలని ఆసుపత్రి ప్రాంగణంలో అవగాహన సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని ముత్యాలమ్మకు జలాభిషేకం

జీలుగుమిల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెంలో ముత్యాలమ్మకు గ్రామస్థులు సోమవారం జలాభిషేకం నిర్వహించారు. రెండు రోజులుగా అమ్మవారి గరగలతో గ్రామస్థులు ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో గ్రామదేవతల పేరున గరగలు ఎత్తుకుని, డప్పు వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహిం చారు. నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు కురిసి పాడి పంట సుభికంగా ఉండాలని మొక్కుకున్నారు.

'చేతి వృత్తుల కుటుంబాలకు ప్రభుత్వం భరోసా'



మగ్గాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చేతివృత్తులపై ఆదార పడి జీవిస్తు న్న కుటుంబాలకు కూటమి ప్రభు త్వం భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు 30వ డివిజన్‌లో 'నేతన్నలకు అండగా కూటమి ప్రభుత్వం' అనే పేరుతో సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ఎంతో నైపుణ్యత కలిగిన చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నామన్నారు. నేతన్నకు భరోసా పథకంలో ఏడాది రూ.25 వేలు ఆర్థిక లబ్ధి చేకూరుస్తున్నామన్నారు. నాయీ బ్రాహ్మణులకు, చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు చొప్పున ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. మరమగ్గాలు వినియోగి స్తున్న వారికి 500యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. మరమగ్గాలపై ఆధారపడిన వారికి నైపుణ్యాలు పెంచేందుకు శిక్షణ ఇస్తామన్నారు. చేనేత ఎగ్జిబిషన్ల ద్వారా అమ్మకాలు చేపట్టేలా ప్రోత్సహిస్తామన్నారు. మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఇడా ఛైర్మన్ పెద్దిబోయి శివప్రసాద్, పార్టీ పరిశీలకులు మీరా వలి, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని, టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, పూజారి నిరంజన్, అమరావతి అశోక్ పాల్గొన్నారు.

టీడీపీ అంటేనే బీసీల పార్టీ : ఎమ్మెల్యే చింతమనేని



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీ అని దెందులూరు ఎమ్మెల్యే చింతమ నేని ప్రభాకర్ అన్నారు. సోమవా రం ఏలూరు డీసీ ఎంఎస్ ఫంక్షన్ హాలులో కూటమి ప్రభుత్వానికి కల్లు గీత కార్మికులు ధన్యవా దాలు తెలుపుతూ నియోజకవర్గ స్థాయి సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్రంలో మ ద్యం షాపుల్లో పది శాతం లైసెన్స్ ఫీజులో గీత కార్మికులకు 50 శాతం రాయతీ కల్పించిందన్నారు. గీత కల్లు కార్మికులతో కలిసి చింతమనేని దివంగత ఎన్టీ ఆర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభి షేకం నిర్వహించారు. గౌడ సంఘం నాయకులు కొనకళ్ల శివమణిగౌడ్, తాతా సత్యనారాయణ, పర్సా వెంకట్రావు, వేమన రాముగౌడ్, పామర్తి నాగభూషణం, ఏఎంసీ ఛైర్మన్ గారపాటి రామసీత, దెందులూరు మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్, మోతుకూరి నాని, గారపాటి కొండయ్యచౌదరి ఉన్నారు.

'సొసైటీ ఛైర్మన్లు రైతులకు మేలు చేయాలి'



ఎమ్మెల్యే మద్దిపాటిని కలిసిన మండల సొసైటీల ఛైర్మన్‌లు

ద్వారకాతిరుమల, ఆగస్టు 11 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యత లను సక్రమంగా నిర్వర్తించి రైతాంగా నికి మేలు చేయా లని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సూచించారు. మండలంలో నూతనంగా నియమితులైన సొసైటీల ఛైర్మన్‌లు సోమవారం ఎమ్మెల్యే వెంకట్రాజును విజయవాడలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి చినవెంకన్న శేషవస్త్రం కప్పి సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు. ద్వారకాతిరుమల, తిరుమలంపాలెం, రామన్నగూడెం, జి.కొత్తపల్లి, గుణ్ణంపల్లి, గుండుగొలనుకుంట సొసైటీల ఛైర్మన్‌లు పోలిన శ్రీనివాసరావు, మాచిరెడ్డి హరిబాబు, మద్రాస్ రాము, రేగంటి రాంబాబు, అక్కిసెట్టి సుధాకర్, అద్దంకి రామచంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు

జిల్లాస్థాయి క్రీడా ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో ఆరు క్రీడాంశాలు హాకీ, ఖోఖో, బాస్కెట్‌బాల్, వాలీబాల్, జిల్లాస్థాయి ఎంపిక పోటీలు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో సోమవారం జరిగాయి. కండ్రికగూడెంలోని బాక్సింగ్ బోక్సియో పిట్ బాక్సింగ్ అకాడమీ బాక్సింగ్, ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలను శాప్ డైరెక్టర్ కె.జగదీశ్వరి ప్రారంభించారు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఈనెల 13న జరిగే జోనల్‌స్థాయి పోటీలలో పాల్గొంటారని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

టి.నరసాపురం,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తెడ్లం గ్రామంలో ఇటీవల మృతి చెం దిన సందోలు బెంజిమెన్ గుండెపోటుతో వ్యక్తిమృతి చెందాడు. ఆ కుటుంబాన్ని కేతిరెడ్డి సీతారామిరెడ్డి చంద్రకాంతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారి కుమా రుడు కేతిరెడ్డి వీరారెడ్డి సోమవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముప్పన స్రవంతి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అదనపు లోడ్.. భారం తగ్గేలా!

(5వ పేజీ తరువాయి)

ఉంటారని అంచనా. వారం దరూ తాము రిజిస్టరు చేసుకున్న దానికంటే అదనంగానే విద్యుత్‌ను వినియో గిస్తున్నారని, దీనివల్ల ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని విద్యుత్ శాఖ వర్గాలు చెబుతున్నాయి. వారందనూ అదనపులోడ్‌ను రెగ్యులరైజ్ చేయించుకోవడా నికి అదనపులోడ్ విద్యుత్ రాయితీని వినియోగించుకోవాలని విద్యుత్ శాఖాధి కారులు సూచిస్తున్నారు.

అదనపులోడ్ విద్యుత్ రాయితీకి దరఖాస్తులు ఇలా..

జిల్లాలోని ఏలూరు విద్యుత్ సర్కిల్ పరిధిలో 13,579 మంది వినియోగదారులు 22,225.05 కిలోవాట్ల అదనపు లోడ్ కావాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులకు సంబంధించి రూ.248.95 లక్షలు వసూలైందని విద్యుత్ శాఖ నివేదికలు చెబుతున్నాయి. ఇందులో డెవలప్‌మెంట్ చార్జీల నిమిత్తం రూ.201.26 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్లుగా రూ.47.69 లక్షలు వసూలైంది. వీరందరికీ విద్యుత్ శాఖ అదనపులోడ్ సదుపాయం కల్పించింది. విద్యుత్ శాఖ డివిజన్ల వారీగా దరఖాస్తులు పరిశీలిస్తే ఏలూరు డివిజన్‌లో 18004.10 కిలోవాట్లకు సంబంధించి 10,966, జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 4220.95 కిలోవాట్లకు సంబంధించి 2,613 మంది వినియోగదారులు దరఖాస్తు చేసుకున్నారు.

అదనపులోడ్‌కు రాయితీ కల్పించాం..



గృహ విద్యుత్ వాడకంలో రాయితీపై అదనపులోడ్ రిజిస్టరు చేసుకోవడానికి స్పెషల్ డ్రైవ్‌లో నిర్వహించాం. రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేసుకోవటానికి డిసెంబరు నెలాఖరు వరకు గడువు పెంచింది. అదనపులోడ్‌కు దరఖాస్తు చేసుకుని విద్యుత్‌ను రెగ్యులరైజ్ చేసుకోవడం వల్ల సాంకేతిక పరంగా విద్యుత్ సమస్యలన్నీ పరిష్కరించడానికి అవకాశం ఏర్పడుతుంది.

– పి.సాల్మన్‌రాజు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ, ఏలూరు జిల్లా



ఏలూరు ప్రభుత్వాసుపత్రి, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి, చింతలపూడి ఏరియా ఆసుపత్రుల వద్ద నాయకులు, కార్మికుల ఆందోళన.. ఏలూరులో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల నిరసన

నిరసనల హోరు

- జీతాలు, పీఎఫ్ చెల్లించాలని పారిశుధ్య కార్మికుల ధర్నా
- ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారంటూ వ్యవసాయ కార్మిక సంఘ నాయకుల నిరసన

ఏలూరు క్రైం/జంగారెడ్డిగూడెం/చింతలపూడి, ఆగస్టు 1(ఆంధ్ర జ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం నిరసనలు హోరెత్తాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వాసుపత్రులలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల జీతాల బకాయిలు, పీఎఫ్ చెల్లిం చాలని ది.మెడికల్ కాంట్రాక్టర్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె కృష్ణమా చార్యులు, జిల్లా కార్యదర్శి వి.దత్తాత్రేయులు డిమాండ్ చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ఉదయం పారిశుధ్య కార్మికులు విధులను బహిష్కరించి ఆసుపత్రి వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్ మారిపోయారని కొత్త కాంట్రాక్టు కోసం టెండర్లు కూడా పిలిచామని, అయితే పాత కాంట్రాక్టర్ జిల్లాలోని పారిశుధ్య కార్మికులకు చెల్లించాల్సిన జీతాలు, పీఎఫ్‌ను చెల్లించాలని ఎన్నిసార్లు లేఖలు రాసినా చెల్లించ లేదన్నారు. ఆ కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు, డిపాజిట్లు నిలిపివేసి వాటిని పారిశుధ్య కార్మికులకు జీతాలుగాను, పీఎఫ్‌గాను చెల్లించాలని కోరుతూ ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖరాశామన్నారు. జీతాలు, పీఎఫ్ సొమ్ము చెల్లించకపోతే నిరవధిక సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యద ర్శి విజయ, వినోద్, కల్యాణి, నరేష్ పలువురు నాయకత్వం వహించారు.

● జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ సోమవారం ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచే వసంతరావు ఆధ్వ ర్యంలో ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి జంపన వెంకట రమణరాజు, సహాయ కార్యదర్శి సుంకర రాధాకృష్ణ, కార్మిక నాయకులు రాజు, మేరి, చంద్రకళ, దమయంతి, దుర్గారావు, శ్రీను పాల్గొన్నారు. చింతలపూడిలో ఏపీ మెడికల్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ మండల శాఖ అధ్యక్షురాలు పి. మరియమ్మ ఆధ్వర్యంలో చింతలపూడి ఆసుప త్రి వద్ద నిరసన తెలిపారు. నాగరాజు, కుమారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరుకార్పొరేషన్: సీపీఎం అనుబంధ సంస్థ అయిన వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని పాలకవర్గాలు కుట్ర చేస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీలకు చెల్లించా ల్సిన నిధులన్నీ చెల్లించాలని కోరారు. నిరసనలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం. జీవరత్నం, పామా ముత్యాలమ్మ, ఎస్.మహం కాళిరావు, యు.వెంకటేష్, సత్యనారాయణ, కె.దుర్గ, చలపతి, ఎ.ప్రభాకర్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

దెందులూరు,ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను రద్దు చేయలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున కార్మికులందరూ పోరాటాలు నిర్వ హిస్తారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్య దర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ అన్నారు. సోమవా రం పెదవేగి పరిధిలోని వ్యవసాయ మార్కె ట్ కార్యాలయ ఆవరణలో కార్మిక సంఘా లతో సీఐటీయూ నాయకులతో కలిసి మం డల అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభు త్వం ఏర్పాటు చేయలన్నారు. నాయకులు పి ప్రసాద్, బిరోజా, రాజ్యలక్ష్మి, గంగాధర రావు, సుబ్బారావు, అనురాధ పాల్గొన్నారు.



జనసేన జెండా స్తూపం ఆవిష్కరణలో ఆదిశేషు, లక్ష్మి దంపతులు

పోతునూరులో జనసేన జెండా స్తూపం ఆవిష్కరణ

దెందులూరు,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):కూటమి లక్ష్యాలకు అను గుణంగా పనిచేస్తూ జనసేన పార్టీని దెందులూరు నియోజక వర్గంలో క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని దెందులూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు కొఠారు ఆదిశేషు, లక్ష్మీ దంపతులు అన్నారు. సోమవారం పోతునూరులో జనసేన పార్టీ జెండా స్తూపాన్ని జనసేన నాయకులు, కార్యకర్తల మధ్య మండల నాయకులు పండూరి దుర్గాప్రసాద్ పలువురు నాయకుల పార్టీ స్తూపాన్ని ఆదిశేషు, లక్ష్మీ దంపతులు ఆవిష్క రించారు. పోతునూరు జనసేన నాయకులు కొమ్మిరెడ్డి శివకృష్ణ, కోడే ఈశ్వరరావు, దాకారపు సత్యనారాయణ, బేరా సాయికుమార్, జనసేన కార్యకర్తలు ఉన్నారు.



హుండీల సొమ్ము లెక్కిస్తున్న గ్రామ పెద్దలు, భక్తులు

అభయాంజనేయుడు హుండీల ఆదాయం రూ.10.32 లక్షలు

పెదపాడు,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం అప్పన వీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి దేవాలయం హుండీల సొమ్ము లెక్కింపు కార్యక్రమాన్ని భక్తులు, దేవాలయ దేవాలయ అధికారులు, సిబ్బంది సమక్షంలో సోమవారం నిర్వహిం చామని ఆలయ ఛైర్మన్ వేమూరి శ్రీనివాసరావు తెలిపారు. హుండీల లెక్కింపు 76 రోజులకు నిర్వహించగా రూ. 10,32,522 ఆదాయం లభించిందన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని మెం డూరు గ్రూప్ దేవాలయ ఈవో రాంబాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఈవో తారకేశ్వరరావు, గ్రామ పెద్దలు వడ్డి వాసవి, గరికిపాటి చంటి, భక్తులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అవార్డు పత్రాన్ని అందుకున్న మోజెస్

బ్లెస్సింగ్ మోజెస్‌కు 'స్వర కిరీటి అవార్డు

చింతలపూడి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):చింతలపూడి పట్టణానికి చెందిన మాజీ ఉద్యోగి ఎం.బ్లెస్సింగ్ మోజెస్‌కు శ్రీశ్రీ కళావేదిక తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమి బుక్ ఆఫ్ రికార్డ్స్ చే 'స్వర కిరీటి అవార్డు'ను ఏలూరులో అందుకున్నారు. గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మోజెస్ తన స్వరంతో ఎన్నో సాహిత్య విలువలు కలిగిన పాటలు పాడారు. ఆయన గాన మాధుర్యానికి గుర్తింపుగా ఈ అవార్డును అందించారు. కళావేదిక ఛైర్మన్ కె.ప్రతాప్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి టి.పార్థసారథి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. తన ప్రతిభను గుర్తించి అవార్డును అందించడం ఎంతో ఆనందం కలిగించిందని, కళావేదిక వారికి రుణపడి ఉన్నానని పేర్కొన్నారు. స్థానికులు ఈ అవార్డు పొందినందుకు ఆయనను అభినందించారు.

జీలుగుమిల్లిలో ఎలక్ట్రికల్ వస్తువులు ధ్వంసం

జీలుగుమిల్లి, ఆగస్టు11: (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లిలో పిడుగు శబ్దానికి ఇళ్లలో పలు ఎలక్ట్రికల్ వస్తువులు ఫ్యాన్, టీవీ, లైట్లు పాడైన ఘటన జరిగింది. సోమవారం సాయంత్రం చిరు జల్లులతో వర్షం పడింది. ఈ క్రమంలో గ్రామ సమీప పొలంలో పిడుగు పడినట్టు పెద్ద శబ్దం రావడంతో పలువురు ఉలిక్కి పడ్డారు. అదే సమయంలో సీఆర్ఆర్.కాలనీ, రామన్నపాలెంలో ఇళ్లల్లో టీవీలు, ఫ్రిజ్‌లు ఫ్యాన్‌లు పాడైనట్లు పలువురు వాపోయారు. సమీప ప్రాంతాల్లో కొద్దిసేపు విద్యుత్ సరఫరా సైతం నిలిచిపోయింది.



సీపీఐ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

23 నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ శత వార్షికోత్సవాలు పురస్కరించుకుని ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, బండి వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాల యంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఏపీలో ఇప్పటికే పార్టీ గ్రామశాఖలు, వార్డు శాఖలు, పట్టణ, మండలాలు, నియోజకవర్గ స్థాయి మహాసభలు పూర్తయ్యాయన్నారు. జిల్లా మహాసభలు జరుగు తున్నాయని, రాష్ట్ర మహాసభలు మొదటిసారిగా ప్రకాశం జిల్లాలో జరుపుతున్నామని తెలిపారు. ఈ మహాసభలకు వెయ్యి మంది ప్రతినిధులు హాజరుకానున్నట్టు చెప్పారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, తీదితరులు పాల్గొంటారన్నారు. జిల్లా సీపీఐ నాయకులు ఉప్పులూరి హే మశంకర్, రెడ్డి శ్రీనివాసడాంగే, పుప్పాల కన్నబాబు, భజంత్రి శ్రీనివాస్, కనకం జగన్, తదితరులు పాల్గొన్నారు.

'రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి'



డాక్టర్లతో మాట్లాడుతున్న ఎంపీపీ రామారావు

కొయ్యలగూడెం,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): రోగు లకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీపీ గంజిమాల రామారావు డాక్టర్లను కోరారు. సోమవారం కొయ్యలగూడెంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. అత్యవసర సమయాల్లో డాక్టర్లు ఎందుకు అందుబాటులో ఉండడం లేదని ప్రశ్నించారు. ఆదివారం మహి ళలపై హత్యాయత్నం జరిగి తీవ్ర గాయాలతో ఆసుపత్రికి వచ్చిన సమయంలో డాక్టర్లు ఎందు కు లేరని ప్రశ్నించారు. 108 వాహనం ఎందుకు పని చేయడంలేదని డాక్టర్లను అడిగారు. మెరు గైన వైద్యసేవలు అందడంలేదని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై స్పందించానని తెలిపారు. డాక్టర్లు ఎల్లప్పుడు రోగులకు అందు బాటులో ఉండాలని కోరారు. మంతెన సోమరాజు, పూలపల్లి రవి, రాజేశ్ పాల్గొన్నారు.

విద్యాశాఖ సర్క్యులర్‌ను రద్దు చేయాలి

ప్రతుల కాపీల దహనం.. పీడీఎస్‌యూ నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

ఏలూరు అర్బన్,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యాసంస్థల్లో స్కూలు ఎస్ఎంసీ సభ్యులు మినహా ఇతర అనధికార వ్యక్తులు, సంస్థలు ప్రవేశించడాన్ని నిషేధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. పాఠశాల విద్య డైరెక్టర్ ఇటీ వల జారీచేసిన ఉత్తర్వులను నిరసిస్తూ సో మవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పీడీఎస్‌యూ నగర కమిటీ ఆధ్వర్యంలో సంఘ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జీవో ప్రతు లను దహనం చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.నాని మాట్లాడుతూ గత 70 ఏళ్ల నుంచి ప్రభుత్వ విద్యాసంస్థల స్థాపన, వాటి పరిరక్షణలో విద్యార్థి సంఘాల పాత్ర వెల కట్టలేనిదన్నారు. పాఠశాలల్లో ఉండే అనేక రకాల సమస్యలు విద్యార్థి సంఘాల వల్లే పరి ష్కారమయ్యాయని వివరించారు. సంఘ నగర శాఖ అధ్యక్షుడు యశ్వంత్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇప్పటికైనా పునరాలోచన చేసి విద్యాశాఖ జారీచేసిన సర్క్యులర్‌ను రద్దు చే యాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంఘ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చ రించారు. పీడీఎస్‌యూ నాయకులు తేజ, అశోక్‌కుమార్, ప్రదీప్, రాజు, రవి, వంశీ, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

నిప్పంటుకుని నేలకూలిన భారీ వృక్షం

- ఐదు గంటల పాటు నిలిచిన రాకపోకలు



చెట్టును తొలగిస్తున్న కార్మికులు

వేలేరుపాడు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కొంత మంది ఆకతాయిలు చేసిన పనికి వందలాది మంది ప్రయాణికులు, వాహనదారులు సుమా రు ఐదు గంటల పాటు నరకం చవిచూడాల్సి వచ్చింది. వేలేరుపాడు అశ్వారావుపేట ప్రధాన రహదారి రామవరం గ్రామ సమీపంలో లోతువాగు పక్కన ఉన్న భారీ వృక్షానికి నిప్పు పెట్టడంతో రెండు రోజులుగా కాలుతున్న వృక్షం సోమవారం మధ్యాహ్నం నేలకూలింది. ఈ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. పక్కనే ఉన్న విద్యుత్‌లైన్‌పై పడడంతో పాటు రహదారికి అడ్డంగా పడిపోవడంతో విద్యుత్ సిబ్బంది, స్థానికులు యుద్ధప్రాతిపదికన రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షాన్ని తొలగించే పనులు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు శ్రమించి చెట్టును తొలగించడంతో రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



చదరంగం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

ఏలూరురూరల్,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థా నిక పడమర వీధిలోని విజ్ఞాన విహార స్కూల్ ప్రాంగణంలో ఏలూరు డిస్ట్రిక్ట్ చెస్ అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో అండర్-17 ఓపెన్ బాలికలకు చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిం చారు. ఓపెన్ విభాగంలో కె.ఓంకార్ ప్రథమ స్థానం, ఎ.తేజశ్విని రెండోస్థానం సాధించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతలు కాకినాడలో జరిగే పోటీలకు ఏలూరు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని కన్వీనర్ వి.వాసుదేవరావు తెలిపారు.

'పీ4 అమలుపై దృష్టి పెట్టాలి'

ఉంగుటూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : పీ4 అమలుపై దృష్టి పెట్టాలని, ప్రజల జీవి తాలను మార్చుదామని ఉంగుటూరు ఎంపీ డీవో రాజ్‌మనోజ్ అన్నారు. సోమవారం ఉం గుటూరు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యదర్శుల సమావేశంలో ఆయన పలు అం శాలను చర్చించారు. గ్రామాల్లో నిరంతరా యంగా తాగునీటి సరఫరాకు సబంధిత అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు.

'త్రిసభ్య కమిటీ పదవి వద్దు'

కామవరపుకోట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : కామవరపుకోట సొసైటీకి ప్రభుత్వం పాతూ రు గ్రామానికి చెందిన ఘంటా మాధవరా వును త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గాను, సభ్యు లుగా తోటకూర వెంకట్రావు, జున్నుబోయిన నారాయణరావులను ప్రభుత్వం నియమిం చింది. జనసేన పార్టీకి చెందిన వెంకట్రావు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జన సేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఆదేశాల మేరకు మెంబరు పదవిని తీసుకోబోమని స్పష్టం చేశారు. గతంలో సొసైటీకి త్రిసభ్య కమిటీలను జనసేన పార్టీకి ఇస్తారని గతంలో హామీ ఇచ్చినప్పటికీ ఎంపికలో టీడీపీకి ఛైర్మన్ పదవి, ఒక మెంబర్ పదవి ఇచ్చారని, కేవలం ఒక ఎంబరు పదవి మాత్రమే జనసే నకు ఇచ్చారు. ఈమేరకు జనసేన నాయకుల అధిష్ఠానం ఆదేశాల మేరకు తనకు ఈ పదవి అక్కర్లేదంటూ ఆయన ప్రకటించారు.



మాట్లాడుతున్న దాసరి శేషు

రైల్వే లైన్ గ్రీన్‌సిగ్నల్‌పై హర్షం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి-కొవ్వూరు (కొవ్వూరు-భద్రాచలం) రైల్వేలైన్‌కు డీపీఆర్ సిద్ధం చేయడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేష హర్షం వ్యక్తం చేశారు. సోమ వారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1960 నుంచి ఈ రైల్వే లైన్ కోసం ఎదురు చూసే ప్రజల ఆశ తీరనుందన్నారు. సత్తుపల్లి నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవేను ఆనుకుని జంగారెడ్డిగూడెం, ఎర్రంపేట, దేవరపల్లి మీదుగా కొవ్వూ రు హౌరా లైన్లకు లింకు ఏర్పడుతుందన్నారు. విశాఖ నుంచి హైద రాబాద్‌కు వంద కిలో మీటర్లు దూర భారం తగ్గుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దృష్టిపెట్టి త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, కోన అప్పారావు, రాగాని శ్రీను, తాళ్ళూరి వెంకటేశ్వరరావు, కొప్పుల రాంబాబు, బలే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి మఠం అభివృద్ధికి రూ.45 కోట్లతో ప్రతిపాదన

ఏలూరురూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా కంది మల్లాయపల్లె బ్రహ్మంగారి మఠాన్ని రూ.45 కోట్లతో సమగ్ర అభివృద్ధికి మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాద వ్ ప్రతిపాదన మేరకు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌యాదవ్ కేంద్రానికి డీపీఆర్ సమర్పించారని వీర బ్రహ్మేంద్రస్వామి మఠం పౌత్రి ఈశ్వరి మహదేవి మఠాధిపతులు వీర శివకుమార్‌స్వామి పేర్కొన్నారు. విశ్వ బ్రాహ్మ ణ ఉద్యోగ, వ్యాపారుల సంఘం వార్షికోత్సవం స్థాని క వైఎంహెచ్‌ఏ హాలులో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థు లను, వివిధ్న రంగాలలో ప్రతిభా వంతులను సత్కరించి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ముని మనుమడు నౌస్సం వీర భట్లయ్య స్వామి, అప్పలభక్తుల శివకేశవరా వు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ, జె.కూర్మాచార్యులు, ఎల్.జగదీశ్, ఎల్. వెంకటే శ్వరరావు, బి.నాగభూషణం, త్రినాథ్, శివరావు, దుర్గాప్రసాద్, భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి ఎంఈవోగా శ్రీనివాస్



కలిదిండి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కలిదిండి ఎంఈవోగా అనిశెట్టి శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో ఆరు తెగలపాడు జడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయనకు కలిదిండి ఎంఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

రేపు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కైకలూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఈ నెల 13న విద్యార్థులకు ఝాన్సీలక్ష్మీభాయ్ పాత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు అధ్యక్షురాలు చిట్టి హేమలత తెలిపారు. 13వ తేదీ ఉదయం 11గంటలకు కైకలూరు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకొని 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, అలాగే దేశభక్తి గీతాలపై కూటా పోటీలు నిర్వహిస్తామని ఆసక్తి కలిగిన విద్యార్థులంతా పాల్గొనాలని కోరారు.

చెట్టు కొమ్మలు తొలగించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



అక్కిరెడ్డిగూడెంలో విద్యుత్ లైన్‌లో చెట్టుకొమ్మలు తొలగించిన దృశ్యం

ముసునూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పొంచి ఉన్న ప్రమాదం శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. అక్కిరెడ్డిగూడెం గ్రామ సచివాలయం సమీపం లో ప్రధాన రహదారి పక్కనే 11 కేవీ విద్యుత్ లైన్, ఎల్టీ కేబుల్ తీగల్లోకి చొచ్చుకుపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్టు కొమ్మలను సోమవారం రమణక్కపేట ట్రాన్స్‌కో ఏఈ మందా రాజ్‌కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది తొలిగించారు. దీంతో గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం, షార్ట్ అయ్యే సమస్య పరిష్కారం కావడంతో 'ఆంధ్రజ్యోతి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



స్నేహితుడికి పూర్వ విద్యార్థుల చేయూత

చాట్రాయి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అనా రోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడికి అండగా నిలిచారు మిత్రులు. ఎన్టీఆర్ జిల్లా కొర్లమండకు చెందిన గొల్లపల్లి రాజారావు అనారోగ్యంతో బాధపడున్నాడు. ఇతను 1991-96 సంవత్సరాలలో మండలంలోని చనుబండ జడ్పీ హైస్కూల్‌లో చదివాడు. రాజారావు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న అతని ఆనాటి స్నేహితులంతా కలసి సోమవారం కొర్లమండ వెళ్ళి రూ. 50 వేలు, దుస్తులు రాజారావుకి అందజేశారు. స్నేహితులకు రాజారావు కృతజ్ఞతలు తెలిపారు.

పేద విద్యార్థి ఇంజనీరింగ్ చదువుకు సాయం



నగదు అందిస్తున్న ఏపీటీడీసీ డైరెక్టర్ వినోద్, టీడీపీ నేత చలసాని

ముదినేపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌లో ఉచిత సీటు సాధించి కళాశాల హాస్టల్ ఫీజు కట్టలేని పరిస్థితుల్లో ఉన్న ముదినేపల్లికి చెందిన కార్యకర్త గంట్యాడ కోటేశ్వరరావు కుమారుడు రవికిరణ్‌కు చదువు పూర్తయ్యే వరకు అండగా ఉంటానని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ భరోసా ఇచ్చారు. విద్యార్థి గుంటూరు జిల్లాలోని ఆర్‌విఆర్‌జెసి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ ఏడాది బీటెక్ సీటు సాధించాడు. హాస్టల్ ఫీజు చెల్లించలేక కళాశాలలో చేరుదామా వద్దా అని సందేహిస్తున్న పరిస్థితుల్లో వినోద్ ఆ ఫీజు చెల్లింపునకు ముందుకొచ్చారు. సోమవారం రవి కిరణ్ తండ్రి కోటేశ్వరరావుకు రూ.10 వేలు నగదును వినోద్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు అందజేశారు.



మహిళను కాపాడిన యువకులకు పారితోషికం అందించి సత్కరిస్తున్న సీఐ రవికుమార్

తల్లి ప్రాణాలు కాపాడిన వారికి నగదు బహుమతి

ముదినేపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి - గుడివాడ జాతీయ రహదారిలో గత నెల 29వ తేదీ రాత్రి పోల్‌రాజ్ మేజర్ డ్రైన్‌లోకి దూసుకుపోయి నీటమునిగిన కారు నుంచి ఓ మహిళను ధైర్యసాహసాలు ప్రదర్శించి కాపాడిన ఇద్దరు యువకులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కారు డ్రైన్‌లోకి దూసుకుపోయిన ప్రాంతంలోనే ఉన్న అసోంకు చెందిన శుభమ్, ఆనందరావు పేటకు చెందిన ఆచారి కాల్వలోకి దూకి నీటమునిగిన కారు నుంచి కృష్ణరాణిని ప్రాణాలతో కాపాడారు. ఆమె భర్త వెంకటేశ్వరరావును కూడా బయటకు తీసినా ఆయన అప్పటికే మరణించారు. తన తల్లిని కాపాడినందుకు కృష్ణరాణి కుమార్తెలు ఆ యువకులు ఒక్కొక్కరికి రూ.25 వేలు పారితోషికం పంపగా, ఆదివారం రాత్రి కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు వారికి అందజేశారు. జనసేన నాయకుడు మోటేపల్లి హనుమ కూడ పాల్గొన్నారు.

ఎంఈవో పాఠశాలల తనిఖీ



ముసునూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసునూరు, వేల్పుచర్ల జడ్పీ పాఠశాలను ఎంఈవో బి.వి.యస్ సుబ్బారావు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బుక్‌లెట్‌లో విద్యార్థులు రాస్తున్న ఎఫ్‌ఏ-1 పరీక్షలను ఆయన తనిఖీ చేసి, పలు సూచనలు ఇచ్చారు. అనంతరం పాఠశాలల్లో సౌకర్యాలతో పాటు మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనంలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని ఏజెన్సీలను హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసేలా ఉత్తమ బోధనలను అందించాలని ఉపాధ్యాయులకు ఎంఈవో సూచించారు.

కొడుకు కత్తితో నరికిన ఘటనలో..

చికిత్స పొందుతూ తల్లి మృతి

కొయ్యలగూడెం,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కొడుకు చేతిలో అతికిరా తకంగా కత్తితో నరికిన ఘటనలో తల్లి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆదివారం కొయ్యలగూడెంలో తల్లి జక్కు నర్సమ్మ(44)ను ఆమె కుమారుడు శివ కత్తితో నరికి గాయపరిచిన ఘటన తెలిసిందే. ఈమేరకు ఆమెను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి ఉన్నత వైద్యం కోసం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం ఆమె మృతి చెందింది. ఆమె కొడుకే ఇంత కిరాతకంగా చంపండంపై ప్రజలు భ యాందోళనలకు గురయ్యారు. ఇల్లు అమ్మి డబ్బులు ఇవ్వాలని తరచూ గొడవ చేస్తుండేవాడని పోలీసులు తెలిపారు. ఆ ఇల్లు అమ్మేదిలేదని తల్లి చెప్పడంతో ఆమెను చంపడానికి సిద్ధపడినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసినట్టు తెలిసింది. ఏలూరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ ప్రజలు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210
నెక్ కోడి గుడ్డు ధర	(100)



విజయవాడ జోన్ రైతు ధర రూ.475



గొల్లగూడెంలో పంట కాల్వను స్తంభాలపై దాటుతున్న అంగన్‌వాడీ చిన్నారులు



మిట్టగూడెం లీలానగర్ పాఠశాల వద్ద ప్రమాదకరంగా ట్యాంక్ వాల్వ్

విద్యార్థులకేదీ రక్షణ?

» అంగన్వాడీ కేంద్రం వద్ద రహదారి లేక పంటకాల్వను స్తంభం మీదుగా దాటుతున్న చిన్నారులు
» నూజివీడు మండలంలో పాఠశాల పక్కనే సంప్

ముదినేపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రానికి రావాలంటే చిన్నారులు ప్రతిరోజూ ప్రాణాలను పణంగా పెట్టాల్సిందే. ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు శివారు గొల్లగూడెం గ్రామంలోని బొమ్మినంపాడు-3 అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు భద్రత కరువైంది. ఈ కేంద్రానికి రహదారి సౌకర్యం లేకపోవటంతో భవనం ఎదురుగా ఉన్న పంట కాల్వ దాటి రావాలి. సూర్యనారాయణ పురం - పాత దళితవాడ రోడ్డు నుంచి ఆ పంట కాల్వపై రహదారి సౌకర్యానికి ఏర్పాటు చేసిన స్తంభాలపై నుంచి పిల్లలు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. ఇది ప్రమాదకరమని తెలిసినా ఐసీడీఎస్ అధికారులు గానీ, పంచాయతీ అధికారులు కానీ రహదారి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవటం లేదు. కనీసం స్థానిక ప్రజాప్రతినిధులు కూడా అటువైపు కన్నెత్తి చూడలేదు. నిత్యం పిల్లలు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేటప్పుడు, ఇళ్లకు తిరిగి వెళ్లే సమయంలో ఆ కేంద్రం ఆయా దగ్గరుండి పిల్లల్ని స్తంభాలపై నడిపిస్తూ కాల్వను దాటించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పాఠశాల పక్కనే సంప్..

(నూజివీడు టౌన్ - ఆంధ్రజ్యోతి)

నూజివీడు మండలం మిట్టగూడెం శివారు లీలానగర్ ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. పాఠశాల పక్కనే లీలానగర్, రామానగర్ ప్రాంతాలకు త్రాగునీటి సరఫరాకు ఉద్దేశించి వాటర్‌ట్యాంకు ఏర్పాటు చేశారు. అయితే సదరు వాటర్‌ట్యాంకు వాల్‌సంప్ పై ఎటువంటి మూత లేకపోవడంతో ప్రక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. ట్యాంక్‌వాల్ సంప్ దాదాపు 6అడుగుల లోతు ఉండటంతో ఆ సంపునిండా నీరు నిండి ఉంది. ప్రక్కనే ఉన్న ఎంపీపీ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న చిన్నారులు సంపువైపుకు వెళితే ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. చిన్నారులు ఆడుకుంటూ అటువైపు వెళితే జరగకూ డని సంఘటనలు జరిగితే విద్యార్థుల తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలే పరిస్థితి ఉన్న దృష్ట్యా తక్షణం పంచాయతీ అధికారులు స్పందించి వాల్ సంప్ పై మూతను ఏర్పాటు చేయాలని లీలానగర్ వాసులు పంచాయతీ అధికారులకు ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు ఆ దిశగా కనీసం అడుగులు వేయలేదు. అనుకోని సంఘటనలు జరిగితే అందుకు పంచాయతీ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, ఇప్పటికైనా మండలస్థాయి అధికారులు స్పందించి పాఠశాల పక్కనే ఉన్న వాటర్‌ట్యాంకు వాల్ సంప్ పై మూతను ఏర్పాటు చేయించాలని, లీలానగర్‌వాసులు కోరుతున్నారు.

చెరువు సర్వే చేయించి ఆక్రమణలు తొలగించండి

కలెక్టర్‌కు చినకామనపూడి పంచాయతీ పాలకవర్గం వినతి

ముదినేపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం చినకామనపూడిలోని 2.35 ఎకరాల విస్తీర్ణం కలిగిన పంచాయతీ ఊర చెరువును సర్వే చేయించి హద్దులను నిర్ణయించాలని కోరుతూ ఆ పంచాయతీ పాలకవర్గం కలెక్టర్ వెట్రిసెల్విని కోరింది. సోమవారం ఏలూరులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఆ పంచాయతీ సర్పంచ్ చిట్టూరి నాంచారయ్యతోపాటు ఉపసర్పంచ్ భట్రాజు శ్రీలక్ష్మి, వార్డు సభ్యులు నున్న నాగమల్లేశ్వరి, ధనలక్ష్మి, కరేటి సహదేవుడు, పలగర్ల వీర కుమారి, పి.గంగా, చొప్పాల రామాంజనేయులు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలోని పశువులకు తాగునీటి సౌకర్యం పెంపొందించేందుకు ఆక్రమణలు తొలగించి ఆ ఊర చెరువును తవ్వించాల్సిన అవసరం ఉందని కలెక్టర్‌కు వివరించారు. చెరువు ఆక్రమణలను తొలగించేందుకు సర్వే నిర్వహించాలని ఏడాది కాలంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇస్తున్నప్పటికీ నేటికీ సమస్య పరిష్కారం కాలేదని సర్పంచ్ నాంచారయ్య కలెక్టర్‌కు వివరించి, ఈ నెల 7న ముదినేపల్లి తహసీల్దార్ కార్యాలయం నుంచి వచ్చిన ఎండార్స్ మెంట్ లెటరులో సమస్య పరిష్కారం అయినట్లు పేర్కొన్నారని తెలిపారు. అయితే ఇంత వరకు చెరువు సర్వే జరగలేదని కలెక్టర్‌కు తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని డిపివో, జిల్లా సర్వేయర్‌ను కలెక్టర్ ఆదేశించినట్లు సర్పంచ్ తెలిపారు.

డ్రోన్ కెమెరాతో నిఘా

ముసునూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ కెమెరాలతో సంఘ విద్రోహ కార్యకలాపాలను నియంత్రించేందుకు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. మూడు రోజుల నుంచి పలు గ్రామాల్లో డ్రోన్ కెమెరాతో పర్యవేక్షణ చేస్తున్న పోలీసులు సోమవారం ముసునూరులో నల్ల చెరువు, దేవర చెరువు తదితర ప్రాంతాల్లో డ్రోన్‌తో నిఘా పెట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో పేకాట, కోడిపందేలు, మాదక ద్రవ్యాల రవాణా, బహిరంగ మద్యం తదితర కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు డ్రోన్ కెమెరాతో ప్రత్యేక నిఘా పెట్టినట్లు దీని వల్ల సంఘ విద్రోహ శక్తులను సునాయాసంగా పట్టుకోవచ్చన్నారు.



అగ్నికి ఆహుతైన సామగ్రి

రెండు పూరిళ్లు దగ్ధం

చాట్రాయి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మగూడెం ఎస్సీ కాలనీలో సోమవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి పక్కపక్కనే ఉన్న మొలుగుమాటి అర్జున, ఆదియ్య అనే అన్నదమ్ముల రెండు పూరిళ్ళు దగ్ధమయ్యాయి. ఈ రెండు కుటుంబాలు ఇళ్ళకు తాళాలు వేసి వ్యవసాయ పనులకు వెళ్ళిన సమయంలో అగ్ని ప్రమాదం సంభవించటంతో ఇంట్లో బట్టలు, టీవీలు, నగదు దగ్ధమై కట్టుబట్టలతో మిగిలామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

చిన్నంపేటలో సారా స్వాధీనం

చాట్రాయి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): చిన్నంపేటలో సోమవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. సారా కలిగి ఉన్న శ్యామల వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకొని రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. సారా తయారీ, అమ్మకం దారులు, బెల్ట్ షాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

టీడీపీ కార్యకర్తలకు తప్పని వేధింపులు : కాపా

నూజివీడు టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నా ఆ పార్టీ కార్యకర్తలకు దిక్కులేని పరిస్థితి ఏర్పడిందని, సాక్షాత్తు రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఇలాకాలోని టీడీపీ కార్యకర్తలకు, అధికారుల నుంచి వేధింపులు తప్పడం లేదని, ఏలూరు జిల్లా నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్, రావిచర్ల సర్పంచ్ కాపా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ ఆదివారం ఉదయం రావిచర్లలో టీడీపీ కార్యకర్త దశదిన కార్యక్రమం సందర్భంగా సంప్రదాయబద్ధంగా కోడి పందెం నిర్వహించాలని చూశారని, పందెం ప్రారంభం కాకముందే దాడిచేసిన నూజివీడు సర్కి ల్ పరిధిలోని ఆగిరిపల్లి పోలీసులు కార్యక్రమంలో పాల్గొనటానికి వచ్చిన వారిని వెంబడించి పట్టుకుని అవమానకర రీతిలో చేతులు కట్టేసి మోకాళ్ళపై కూర్చోబెట్టి ఫొటోలు తీశారన్నారు. దశదిన కార్యక్రమం సందర్భంగా మృతుడికి ఇష్టమైన కోడిపందెం నిర్వహించి సైకిల్ బహుమతిగా ఇవ్వడానికి ఒక వ్యక్తి ముందుకు వస్తే సైకిల్ ఇచ్చిన వ్యక్తిని సైతం అరెస్ట్ చేసి వేధించటం దారుణమన్నారు. దీనిని మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి సైతం తీసుకువెళ్ళనున్నట్లు ఆయన తెలిపారు. వాస్తవంగా నియోజకవర్గంలో పేకాట, కోడిపందేలను పోలీసులే పెట్టిస్తున్నారని, వారే పట్టుకుంటున్నారని కాసుల కోసం వారు ఏమైనా చేయటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మరోవైపు రెవె న్యూ అధికారులు సైతం టీడీపీ కార్యకర్తలే లక్ష్యంగా దాడులు నిర్వహిస్తున్నారన్నారు. ఆగిరిపల్లి మండలం లో నిరుపేదలు ఇళ్ళ నిర్మాణానికి రెండు, మూడు ట్రక్కుల మట్టిని తోలుతుంటే ఆగిరిపల్లి ఎమ్మార్వో మట్టి ట్రాక్టర్లను తీసుకువచ్చి తహసీల్దార్ కార్యాల యంలో పెట్టారని, అదే ఆగిరిపల్లి మండలంలో టిప్పర్లకు టిప్పర్లు గ్రావెల్ ప్రతిరోజూ రాత్రివేళ తరలి పోతున్నా కనీసం వాటిపై దాడులు చేయటం లేదన్నా రు. మట్టి తరలిస్తున్న టిప్పర్ల పుణ్యమా అని రహ దారులు ధ్వంసం అయ్యాయని, ఫలితంగా నిత్యం రైతులు పొలాల్లోకి వెళ్ళాలంటే నరకం చూస్తున్నారని, ఈ విధంగా అధికారులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే లక్ష్యంగా దాడులకు తెగబడటం దారుణమన్నారు.

'బలహీనవర్గాల అభ్యున్నతికి సీఎం కృషి'



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గౌడ సంఘ నాయకులు

నూజివీడు టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల మంజూరులో పదిశాతం రిజర్వేషన్లు కేటాయించారని, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వి. గురుమూర్తి అన్నారు. నూజివీడు ఆర్టీసీ బస్టాండు సమీపంలో గౌతు లచ్చన్న విగ్రహం వద్ద చంద్రబాబునాయుడుకు పాలాభిషేకాన్ని నిర్వహించారు. తొలుత సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి గౌడసంఘ నాయకులు పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం గురుమూర్తి మాట్లాడుతూ గీతకార్మికులు ఆర్థికంగా ఎదుగుదలకు తోడ్పాటు అయ్యేలా పదిశాతం మద్యం దుకాణాలను కేటాయించటం అభినందనీయమన్నారు. ఫలితంగా ఏలూరుజిల్లాలో 14 షాపులు, నూజివీడు నియోజకవర్గ పరిధిలో నాలుగు దుకాణాలు లభించా యన్నారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు కొత్తగా 89 కల్లుగీత కార్మికుల గుర్తింపుకార్డులు మంజూరు అయ్యాయని, 50 శాతం సబ్సిడీతో గీత కార్మికులకు రూ.30 లక్షల వరకు రుణాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. దీన్ని గీతకార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. గౌడ సంఘం నాయకులు ఏ.శ్రీను, మరీదు శివరామకృష్ణ, పి.కోటేశ్వరరావు, బాబురావు, సత్యనారాయణ, మల్లిఖార్జున్‌రావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆల్బెండాజోల్ పంపిణీ

కైకలూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణ దినం విజయవంతం చేయాలని సీతనపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి అన్నపూర్ణ అన్నారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులందరికి ఆల్‌బెండోజెల్ మాత్రలను పంపిణీ జరుగుతుందన్నారు. ఏడాది నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలందరికి ఈ మాత్రల పంపిణీ జరుగుతుందన్నారు. ఇప్పటికే దీనిపై వైద్యసిబ్బందికి పలు సూచనలు ఇచ్చినట్టు తెలిపారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

నూజివీడు టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలో తొలిసారి నిర్వహిస్తున్న సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ అన్నారు. సుందరయ్య భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధ్యాపకుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి సీఐటీయూ కృషి చేసిందన్నారు. ఎన్నికలకు ముందు అంగన్‌వాడీ సమస్యలపై 42 రోజులు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించిందన్నారు. ప్రైవేట్ రంగాల్లో పనిచేసే ఉద్యోగుల కోసం పోరాడుతోందని, కార్మికులందరూ నూజివీడులోని పెనుగొండ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వచ్చే నెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహిస్తున్న జిల్లామహాసభలను విజయవంతం చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు జి.రాజు, ఎన్ఆర్ హనుమాన్లు పాల్గొన్నారు.

14 నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పవిత్రోత్సవాలు



ముదినేపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సింగరాయ పాలెం - చేవూరు పాలెం సెంటరులో వేంచేసి ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవ స్థానంలో ఈ నెల 14 నుంచి స్వామి వార్ల పవిత్రో త్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు 16 వరకు జరుగుతాయి. ఈ నెల 14న సుప్రభాత సేవ, గోపూజ, వేదపారాయణం, విఘ్నేశ్వరపూజ, మూర్తి హోమాలు, 15న మండపారాధన, ఏకాదశ రుద్రాభి షేకం, స్వామివార్లకు పట్టు పవిత్రాల సమర్పణ, 16న గోపూజ, మహాపూర్ణాహుతి, మహో కుంభాభిషేకం జరుగుతాయని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్. గంగా శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా 16న స్వామి వార్ల కళ్యాణం నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా ఈ నెల 22న శ్రావణ లక్ష్మి 2025లో భాగంగా దేవ స్థానంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరుగుతాయని శ్రీదేవి తెలిపారు. వ్రతాల్లో పాల్గొనే మహి ళలు ముందుగా తమ పేర్లు నమోదు చేయించుకుని, పూజా సామాగ్రి తెచ్చుకోవాలని తెలిపారు.

ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరాలి

మండవల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిపై జాతీయజెండా రెపరెపలాడాలని జిల్లా బీజేపీ వైస్ ప్రెసిడెంట్ సమయం ఏసుబాబు అన్నారు. సోమవారం చావలిపాడులో 17వ పోలింగ్ బూత్‌లో జాతీయ జెండాలను ఇంటింటికి అందజేశారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సహకారంతో హర్‌ఘర్ తిరంగా అభియాన్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి జెండాలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు యలవర్తి మల్లిబాబు, భైరవపట్నం నీటి సంఘం సభ్యుడు బుర్ల గోపాలకృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

అదనపు లోడ్.. భారం తగ్గేలా!

(5వ పేజీ తరువాయి)

ఉంటారని అంచనా. వారం దరూ తాము రిజిస్టరు చేసుకున్న దానికంటే అదనంగానే విద్యుత్‌ను వినియో గిస్తున్నారని, దీనివల్ల ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని విద్యుత్ శాఖ వర్గాలు చెబుతున్నాయి. వారందనూ అదనపులోడ్‌ను రెగ్యులరైజ్ చేయించుకోవడా నికి అదనపులోడ్ విద్యుత్ రాయితీని వినియోగించుకోవాలని విద్యుత్ శాఖాధి కారులు సూచిస్తున్నారు.

అదనపులోడ్ విద్యుత్ రాయితీకి దరఖాస్తులు ఇలా..

జిల్లాలోని ఏలూరు విద్యుత్ సర్కిల్ పరిధిలో 13,579 మంది వినియోగదారులు 22,225.05 కిలో వాట్ల అదనపు లోడ్ కావాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులకు సంబంధించి రూ.248.95 లక్షలు వసూలైందని విద్యుత్ శాఖ నివేదికలు చెబుతున్నాయి. ఇందులో డెవలప్‌మెంట్ చార్జీల నిమిత్తం రూ.201.26 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్లుగా రూ.47.69 లక్షలు వసూలైంది. వీరందరికీ విద్యుత్ శాఖ అదనపులోడ్ సదుపాయం కల్పించింది. విద్యుత్ శాఖ డివిజన్ల వారీగా దరఖాస్తులు పరిశీలిస్తే ఏలూరు డివిజన్‌లో 18004.10 కిలోవాట్లకు సంబంధించి 10,966, జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 4220.95 కిలో వాట్లకు సంబంధించి 2,613 మంది వినియోగదారులు దరఖాస్తు చేసుకున్నారు.



అదనపులోడ్‌కు రాయితీ కల్పించాం..

గృహ విద్యుత్ వాడకంలో రాయితీపై అదనపులోడ్ రిజిస్టరు చేసుకోవడానికి స్పెషల్ డ్రైవ్‌లో నిర్వహించాం. రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేసుకోవటానికి డిసెంబరు నెలాఖరు వరకు గడువు పెంచింది. అదనపులోడ్‌కు దరఖాస్తు చేసుకుని విద్యుత్‌ను రెగ్యులరైజ్ చేసుకోవడం వల్ల సాంకేతిక పరంగా విద్యుత్ సమస్యలన్నీ పరిష్కరించడానికి అవకాశం ఏర్పడుతుంది.

పి.సాల్మన్‌రాజు,
ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ, ఏలూరు జిల్లా

వంతెనపై నిలిచిన వాననీరు..

ప్రయాణికుల పాట్లు

వంతెనకు కూడా ముప్పేనని పలువురి ఆందోళన



పెద్దఎడ్లగాడి వంతెనపై వర్షపునీరు నిల్వ ఉన్న దృశ్యం

కైకలూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నిత్యం వాహనాలు ప్రయాణించే వంతెన... మధ్యలో వర్షపు నీరు... రాకపోకలు సాగించాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వర్షపునీరు వంతెన పై నుంచి ఎటూ వెళ్లే మార్గం లేకపోవడంతో చెరువును తలపిస్తోంది. కైకలూరు-ఏలూరు ఆర్‌అండ్‌బీ రహదారిలో పెద్దఎడ్లగాడి వంతెనపై ఈ దుస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనదారులు ఈ వంతెనపై ప్రయాణిస్తుంటే ఎదురెదురుగా వస్తున్న వాహనాలతో ఈ నీరు మీద చిమ్ముతోంది. అలాగే రాత్రి సమయంలో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పలు పనులపై వెళ్లే ప్రజలు ఆ ప్రాంతం వచ్చేసరికి నీరు ఎక్కడ మీద పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఆ నీరు మీద పడి బట్టలు పాడవడంతో ఇళ్ళకు తిరిగి వెళ్లిపోతున్నారు. అలాగే వంతెనపై నీరు నిల్వ ఉండడం వల్ల వంతెన దెబ్బతినే పరిస్థితులు నెలకొంటాయని, అందువలన ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి వంతెనపై నీరు పారుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
నూజివీడు : 99854 02464
కైకలూరు : 99854 11868

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234